# శ్రీశ్రీశ్రీ బాలమురుగన్ కుమారస్వామి విగ్రహ ప్రతిష్టాపనకు ఆహ్వానం



**కుత్బుల్లాపూర్ మే 15 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ సుభాష్ నగర్ లో తమ్మిలియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 19న నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ బాలమురుగన్ కుమారస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి, ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ ని తమిలియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆహ్వానించారు. కార్యక్రమంలో తమిలియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొట్టాయి స్వామి, ఉపాధ్యక్షులు గణేషన్, ప్రధాన కార్యదర్శి చిన్నస్వామి, సంయుక్త కార్యదర్శి ఆనందన్, కోశాధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యధికం భువనగిరి .. అత్యల్పం హైదరాబాద్

**హైదరాబాద్ మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలంగాణలో లోక్ సభ ఎన్నికల్లో భారీ సంఖ్యలో ఓటింగ్ శాతం నమోదయింది. ఎన్నికల కమీషన్ ఫైనల్ ఓటింగ్ శాతాన్ని ప్రకటించింది. సరళి పై పూర్తిస్థాయి కసరత్తు చేసిన ఎలక్షన్ కమిషన్ తుది ఓటింగ్ శాతాన్ని ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 17 లోక్ సభ స్థానాలకుగాను 65.67% నమోదయింది. 2019 లోక్ సభ ఎన్నికలతో పోలిస్తే ఈసారి మూడు శాతం ఓటింగ్ అధికంగా నమోదు అయినట్లు వెల్లడించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మూడు కోట్ల 32 లక్షల 16 వేల మంది ఓటర్లు ఉండగా, రెండు కోట్ల 20 లక్షల 24 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.రెండు కోట్ల 20 లక్షల 24 వేల ఓటర్లలో రెండు కోట్ల 18 లక్షల 14 వేల మంది 35వేల పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కును వినియోగించుకోగా, మిగిలిన రెండు లక్షల పదివేల మంది పోస్టల్ బ్యాలెట్, ఇంటి వద్ద తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని ఎన్నికల కమీషన్ తెలిపింది. ఈ రెండు లక్షల పదివేల మందిలో 1,89,000 మంది ఓటర్లు ప్రభుత్వ ఉద్యోగులు కాగా, 21,680 మంది వృద్ధులు ఇంటి వద్ద ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు వెల్లడించారు. అత్యధికంగా భువనగిరి పార్లమెంటు స్థానంలో 76.78 శాతం నమోదు కాగా అత్యల్పంగా హైదరాబాద్ పార్లమెంటు పరిధిలో 48.48 శాతం నమోదు అయింది. ఎక్కడా చెప్పుకోదగ్గ హింసాత్మక ఘటనలు నమోదుకాలేదని స్పష్టం చేసింది.

# అవినాష్ రెడ్డి హ్యాట్రిక్ కి షర్మిల చెక్ !?




**కడప మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కడప ఎంపీ బరిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పోటీ చేయడం 2024 ఎన్నికల్లో అత్యంత కీలకమైన సంచలనమైన అంశంగా అంతా చూశారు. దానికి తోడు అయిదేళ్ల క్రితం జగనన్న వదిలిన బాణం అంటూ బై బై బాబూ అని 2019లో షర్మిల చేసిన ఎన్నికల ప్రచారం కళ్ళ ముందు ఉంది. చెవులలో వినబడుతోంది.అలాంటిది ఈ రోజు జగన్ కి ఎదురు నిలిచి ప్రత్యర్థులు సైతం చేయలేని విమర్శలు సొంత అన్న మీద చేయడం ద్వారా ఏపీ రాజకీయాన్ని ఆమె ఆకట్టుకున్నారు. ఇంకో వైపు చూస్తే కడప అన్నది వైఎస్సార్ కుటుంబానికి అడ్డా. అక్కడ కాంగ్రెస్ నుంచి పోటీ చేయడం ద్వారా వైసీపీని షర్మిల గట్టిగానే సవాల్ చేసింది.కాంగ్రెస్ అంటే అసలు పడని జగన్ కి సొంత చెల్లెలు ఆ పార్టీలోకి వెళ్ళం ఇబ్బందిని కలిగిస్తే షర్మిల కడప గడ్డ మీదనే పోటీకి సిద్ధపడడం మరో సంచలనం. ఇలా వైసీపీ ఎంపీ అభ్యర్ధి అయిన అవినాష్ రెడ్డి హ్యాట్రిక్ కి చెక్ పెట్టాలని చాలా తీవ్ర స్థాయిలో షర్మిల పోరాటం చేశారు. ఇక 2019 ఎన్నికల్లో చూస్తే కడప ఎంపీ సీటులో కాంగ్రెస్ కి వచ్చిన ఓట్లు నోటా కంటే తక్కువ.ఇక అవినాష్ రెడ్డికి ఏకంగా మెజారిటీయే 3 లక్షల 81 వేల దాకా వచ్చింది. ఆ ఎన్నికల్లో వైసీపీకి 783,499 ఓట్లు వస్తే టీడీపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డికి 402,773 ఓట్లు వచ్చాయి. ఇలా కడప ఎంపీ సీటులో పరిస్థితి ఉంది. మరి షర్మిల ఏ లెక్కలతో ఎంపీ సీటుకు పోటీ పడుతున్నారు అంటే ఆమె రాజన్న బిడ్డను అని ఒక సెంటిమెంట్ ని రగిలించారు. తద్వారా ఆమె వైసీపీ ఓట్లకు గండి పెట్టాలని చూసారు.అదే విధంగా బాబాయ్ వైఎస్ వివేకా హత్య కేసుని కూడా ఆమె ముందుకు తెచ్చారు. పదే పదే ఆ అంశం చుట్టూనే ప్రచారం మొత్తం సాగింది. దీని వల్ల సగటు ప్రజానీకంలో వైసీపీ పట్ల వ్యతిరేకత పెంచి తమకు అనుకూలం చేసుకోవాలని ఒక ఎత్తుగడ వేసారు. ఇక టీడీపీ నుంచి కూడా లోపాయికారీ సాయం షర్మిలకు అందింది అని పోలింగ్ అనంతర సన్నివేశాలు చెబుతున్నాయి.అంతే కాదు వైసీపీ నుంచి కూడా క్రాస్ ఓటింగ్ జరిగింది అని అంటున్నారు. అదెలా అంటే వైసీపీలో అవినాష్ రెడ్డి పట్ల కొంత అసంతృప్తి ఉన్న వారు షర్మిలకు ఓటు వేశారు అని చెబుతున్నారు. అలాగే టీడీపీ లో కూడా క్రాస్ ఓటింగ్ బాగా జరిగింది అని అంటున్నారు. ఎమ్మెల్యేల వరకూ ఎలా ఉన్నా ఎంపీ సీటు తీసుకుంటే క్రాస్ చేసి కాంగ్రెస్ ని వేయమని ఆదేశాలు వచ్చినట్లుగా ప్రచారం సాగింది.ఇక బీజేపీ జాతీయ స్థాయిలో ఇచ్చిన నినాదం ముస్లిమ్రిజర్వేషన్లు రద్దు అన్న దానితో ఆయా వర్గాలు కాంగ్రెస్ వైపు కొంత మొగ్గు చూపాయని అంటున్నారు. ఈ విధంగా చూస్తే షర్మిల అనూహ్యంగా బలమైన పోటీయే ఇచ్చింది అని నివేదికలు చెబుతున్నాయి. నిజానికి చూస్తే కడప ఎంపీ సీటులో త్రిముఖ పోరు సాగాలి.కానీ అక్కడ సెకండ ప్లేస్ లో ఉండాల్సిన టీడీపీ షర్మిల పోటీతో మూడవ ప్లేస్ లోకి వచ్చారన్న చర్చ సాగుతోంది. అంటే అవినాష్ రెడ్డి వర్సెస్ షర్మిల అన్నట్లుగానే పోరు సాగింది అని అంటున్నారు. అలా వైసీపీ వ్యతిరేక ఓట్లను పోలరైజ్ చేయడంలో షర్మిల విజయవంతం అయ్యారని అంటున్నారు.అయితే ఆ ఓట్లు ఆమె గెలిచేందుకు ఉపయోగపడతాయా అన్నదే చర్చగా ఉంది. 783,499 ఓట్లను 2019లో సాధించి 3 లక్షల 81 వేల దాకా మెజారిటీని దక్కించుకున్న అవినాష్ రెడ్డిని వెనక్కి లాగి ముందుకు వెళ్ళడం అన్నది ఇపుడున్న పరిస్థితుల్లో సాధ్యపడేది కాదని అంటున్నారు. కాకపోతే అవినాష్ రెడ్డికి వచ్చిన 3 లక్షల 81 వేల మెజారిటీని బాగా తగ్గించడంలో షర్మిల పోటీ కీలక పాత్ర పోషిస్తుంది అని అంటున్నారు.అలా సెకండ్ ప్లేస్ లోకి వచ్చి అవినాష్ మెజారిటీని ఏ లక్షకో పరిమితం చేసినా అది షర్మిల సక్సెస్ గానే చూడాలని అంటున్నారు.

# గ్రూపు రాజకీయాలకు ఝాన్సీ రెడ్డి సింహ స్వప్నం

● పాలకుర్తి నియోజకవర్గం లో రౌడీ రాజకీయాలను ఉపేక్షించని నైజం ● కబ్జా కోర్లు దగా కోర్లకు పాలకుర్తిలో స్థానం లేదని తేల్చి చెప్పిన గొప్పతనం ● అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఝాన్సీ రెడ్డి



**తొర్రూర్ ,మే 15 ( పంతం సురేందర్ )** పేదల జీవితాల్లో వెలుగు నింపాలని సప్త సముద్రాలు దాటి అమెరికా దేశంలో తన 40 ఏళ్ల విలాసవంతమైన జీవితాన్ని వదులుకొని, పాలకుర్తి నియోజకవర్గం ప్రజల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా, పనిచేస్తున్న ఝాన్సీ రాజేందర్ రెడ్డికి, పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు నిరాజనం. పరదేశంలో ఉన్న తన పుట్టిన గడ్డపై మమకారాన్ని అనురాగాన్ని మరిచిపోని మహోన్నతమైన వ్యక్తి, ఉన్న ఊరు కన్నతల్లి అని గుర్తించి పుట్టిన గ్రామానికి మెట్టిన ప్రాంతానికి, సేవ చేయడమే లక్ష్యంగా, 2023 జూన్ 15 నా పాలకుర్తి నియోజకవర్గం లో తొలి పాదం మోపి రాజకీయ రంగ ప్రవేశం చేయడం జరిగింది. నాటి నుండి నేటి వరకు ప్రత్యర్థి గుండెల్లో రైళ్లు పరిగెత్తించేటట్లు చేసి వారి ఎత్తుగడలను ఎప్పటికప్పుడు చిత్తు చేస్తూ , పాలకుర్తి నియోజకవర్గ రాజకీయాలను ప్రక్షాళన గావించింది, గత 15 ఏండ్లుగా నియోజకవర్గం దగా కోర్లు కబ్జాకోర్ల కామాంధుల కోరల్లో చిక్కుకున్న పాలకుర్తి నియోజకవర్గాన్ని రాబందుల చెర నుండి రక్షణ గావించింది, ఝాన్సీ రెడ్డి అంటే పాలకుర్తిలో వ్యక్తి కాదు ఒక శక్తి అని నిరూపించింది. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అయిన ఎర్రబెల్లి దయాకర్ రావు ఎత్తులకు పై ఎత్తు వేస్తూ, న్యాయాన్ని నాలుగు పాదాలపై నడిపించింది, ఝాన్సీ రెడ్డి పౌరసత్వాన్ని అడ్డుకుంటే వారసత్వాన్ని తెచ్చి, ప్రత్యర్థిని చిత్తుచిత్తుగా ఓడించి, పాలకుర్తి పౌరుషమైన వీరవనిత చాకలి ఐలమ్మ సాహసాన్ని మరొక్కసారి నిరూపించింది. తన వారసత్వానికి అధికారం వచ్చిన తర్వాత కూడా, ఎలాంటి రాగద్వేషాలకు లోను గాకుండా, పాలకుర్తి నియోజకవర్గం ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, ఆపద వస్తే ప్రజలు అమ్మ అంటే అర్ధరాత్రి కూడా, ఆదరించే ఓ మనసున్న మనిషి ఝాన్సీ రాజేందర్ రెడ్డి, ఇలాంటి మనసున్న మహారాణి పేద ప్రజల మనసులో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న, మహాశక్తి ఝాన్సీ రెడ్డి. తన సేవలు ప్రపంచ దేశాల సరిహద్దులను దాటి, స్వదేశమైన భారత వాణి, కి మణిహారంల పుట్టిన ఊరును మెట్టిన ప్రాంతం రుణం తీర్చుకోవాలని సంకల్పంతో, పనిచేయడం పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు చేసుకున్న పూర్వజన్మల పుణ్యమే అని చెప్పవచ్చు, ఏది ఏమైనప్పటికీ పాలకుర్తి నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉండాలన్నదే ఆమె ఆకాంక్ష, ఓ నాయకుడు ఇంకో నాయకుడిని తయారు చేయాలి తప్ప, బానిసలను రౌడీలను దగాకోరులను, తయారుచేయకూడదన్నదే, ఆమె ఆలోచన, తన పార్టీలో ఉండే ఏ నాయకుడైనా దగాకోరు రాజకీయాలు చేసి ప్రజల్ని భయభ్రాంతులకు లోను చేస్తే ఎవరిని ఉపేక్షించనన్నదే ఆమె నైజం, ఎవరికి ఏ ఆపదైనా ఎవరు తలపెట్టిన, తనను కలవడానికి తన గుమ్మం తలుపులు ఎప్పుడు తెరిచి ఉంటాయన్నదే, ఆమె ఎల్లలు లేని సౌ హృదయానికి సాక్ష్యం, తప్పు చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించనని, నిరూపించుకున్న ఓ గొప్ప మనిషి, ఇలాంటి మనిషికి పాలకుర్తి ప్రజలు కలకాలం రుణపడి ఉంటారనేది వాస్తవం.

# అలుపెరగక బి.ఆర్.ఎస్. అభ్యర్థి విజయానికి కృషి చేసిన శ్రేణులకు అభినందనలు

## -శాసనసభ్యులు అరికపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,మే 15 (వార్తాప్రభ):**పార్లమెంట్ ఎన్నికల ముగిసిన తదనంతరం మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,అధ్యక్షులు శ్రీనివాన్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎన్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను అభినందించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంతో అత్యంత కీలకమైన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకున్న నియోజకవర్గ ఓటర్లతో పాటు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు,నాయకులకు,కార్యకర్తలకు బీఆర్ఎస్ అభిమానులకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన స్వల్ప కాలంలోనే పార్లమెంటు ఎన్నికలు వచ్చినప్పటికీ తనకు అఖండ మెజార్టీ అందించటమే కాకుండా..బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకోసం నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు తామే అభ్యర్థిలా భావించి అలుపెరగకుండా శ్రమించారని ఎమ్మెల్యే గాంధీ అభినందించారు.రాజకీయ పరంగా ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నా నిజమైన నిఖార్సయిన గులాబీ శ్రేణులెవరూ ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రజా క్షేత్రంలో నిలబడి అవిరళ,నిర్విరామంగా కృషి చేసారన్నారు.పదేండ్ల కాలంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లటంలో, ఓటర్లను చైతన్య పరచటంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల కృషి స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.కార్యకర్తలే ఎప్పటికయినా పార్టీకి బలమని బలగమని గులాబీ సైనికులు ఈ ఎన్నికల ద్వారా మరోసారి నిరూపించారని ఈ సందర్భంగా నియోజకవర్గ,డివిజన్,కాలనీ,బూత్ స్థాయి నేతలు,మహిళా కార్యకర్తలకు ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్ముందు ఎన్నికలలోనూ ఇదే స్ఫూర్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిన్న మధుసూదన్ రెడ్డి,మామిడల రాజయ్య, ఖాసీం,లియకత్,బాబు మియ,సలీం రాజయ్య,మియన్ పటేల్,బాబు మియా,కాజా, అజిముల్లా ఖాన్,షేక్ ఇమ్రాన్, మహమ్మద్,అరవింద్ ఠాకూర్, షేక్ సలీమ్,నవాబ్,స్నేహ,రహ్మత్ సేన్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# తోటి పాత్రికేయునికి మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ సాయం

**మల్కాజిగిరి, మే 15 (వార్తా ప్రభ ప్రతినిధి** : గుండెపోటుకు గురైన స్టంట్ వేయించుకున్న తోటి పాత్రికేయునికి మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ (518/2023) ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేసింది. ఇటీవల ఛాతి నొప్పితో హాస్పిటల్‌లో చేరిన ఆదాబ్ హైదరాబాద్ రిపోర్టర్ కుమ్మరి రాజును వైద్యులు పరీక్షలు నిర్వహించగా ఒక వాల్వు బ్లాక్ అయిందని గుర్తించారు. వెంటనే స్టంట్ వేయించుకోవాలని వైద్యులు సూచించడంతో యశోద హాస్పిటల్‌లోని వైద్యులు స్టంట్ వేశారు. దీనిపై స్పందించిన మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ (518/2023) ప్రతినిధులు ఉడుతా భక్తిగా రాజుకు రూ.12000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తోటి మనిషి ఆపదలో ఉన్నప్పుడా తమవంతు సహాన్ని అందించి మానవత్వాన్ని చాటుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్. బాలరాజు, కార్యదర్శి విశాల్ యాదవ్, కోశాధికారి రెహ్మాన్, ముఖ్య సలహాదారులు సునీల్ రెడ్డి, లవకుమార్, సభ్యులు శివ కుమార్, శ్రీకాంత్, మనోహర్, మహేందర్, వెంకట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గం లో బూత్ ల వారీగా ఓటింగ్ శాతం, వివిధ అంశాలపై చర్చ



**కుత్బుల్లాపూర్ మే 15 (వార్తాప్రభ)** : మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి ని బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియాజకవర్గం లో బూత్ల వారీగా వోటింగ్ శాతం, వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ వివిధ డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు సెంటర్ ల తనిఖీ



**ఖానాపూర్ మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఖానాపూర్ మండల పరిధిలోని సొసైటీ వరి ధాన్యం కొనుగోలు సెంటర్ బుధరావుపేట, ఐనపల్లి ఖానాపూర్ సెంటర్లను వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి బుధవారం తనిఖీ చేశారు. అవకతవకలకు జరిగితే వారి పై చర్యలు తీసుకుంటామని అడిషనల్ జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ శివప్రసాద్ వరంగల్ డిసిఓ సంజీవరెడ్డి , సివిల్ సప్లై డిఎం స్వప్న సివిల్ సప్లైస్ డిటి, సొసైటీ సింబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సేవా తత్వానికి ప్రతిరూపం

## ఫ్లోరెన్స్ నైటింగేల్ -ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఘన నివాళి





**శేరిలింగంపల్లి,మే 15 (వార్తాప్రభ)**:అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో గల పద్మా రెసిడెన్సీ అపార్ట్ మెంట్స్ (ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర) నందు ' ఫ్లోరెన్స్ నైటింగేల్' జయంతి వేడుకలను ఈ.దేవానంద్ యాదవ్ సౌజన్యంతో నిర్వహించారు.ఈ సందర్భంగా 'ఫ్లోరెన్స్ నైటింగేల్' చిత్రానికి పుష్పాంజలి ఘటించి,క్రొవ్వొత్తులను వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మధుసూదన్ (సివిల్ సర్జన్, ఆర్థో,జిల్లా వైద్యశాల,రంగారెడ్డి జిల్లా) విచ్చేసి వివిధ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వంలో వైద్యశాలలలో పనిచేస్తూ ఉత్తమ సేవలందించిన సేవామూర్తులైన 80 మంది నర్సులకు 'ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారం తో (జ్ఞాపిక, శాలువా,పుష్పగుచ్ఛం) ఘనంగా సత్కరించి తదనంతరం మాట్లాడుతూ రోగులకు వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవలు కూడా అంతే ముఖ్యం"అని అన్నారు.'"ఫ్లోరెన్స్ నైటింగేల్ 1820 మే 12న ఇటలీలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు.చిన్నతనం నుండి సేవాతత్వాన్ని అలవరచుకున్న వ్యక్తి నైటింగేల్"అని అన్నారు. "మానవసేవే మాధవసేవగా భావించి మానవులకు సేవ చేయడానికి నర్సు వృత్తి సరైనదని భావించి ఈ వృత్తిని ఎంచుకొని ఆనాటి సమాజ కట్టుబాట్లను ఎదిరించి ఎన్నో కష్టాలను చిరునవ్వుతో ఎదుర్కొన్నటువంటి ధీశాలి.ఆ రోజులలో ఆసుపత్రులు శుచీ శుభ్రత లేకుండా చాలా అధ్వాన్నంగా ఉండేవి.ఆవిడ జర్మనీ,ఐర్లాండ్ దేశాలలో తాను పనిచేసిన హాస్పిటళ్ళలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో కృషి చేశారు.1854 - 56 ప్రాంతంలో క్రీమియాలో ఘోర యుద్ధం జరిగినప్పుడు క్షతగాత్రులైన సైనికులకు నిరుపమానమైన సేవలు అందించి వారికి ధైర్యం చెప్పేది. సహచర నర్సులను తీసుకుని రాత్రి సమయంలో దీపం తీసుకుని క్షతగాత్రులైన సైనికుల వద్దకు వెళ్ళి వారికి వైద్య సహాయాలను అందించి ఆ సైనికుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచింది.ఈ కారణంగా ఆవిడను 'లేడీ విత్ ల్యాంప్'అంటూ గౌరవించేవారు.ఆ సైనికులలో ఆత్మస్థైర్యాన్ని నింపి మరణాల సంఖ్య తగ్గించారు.ఆమె అనేక గ్రంథాలయాలను ఏర్పాటు చేసి అక్షరాస్యతకై విశేష కృషి చేశారు.ఆవిడ 1860 జూన్ 24న 'ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సెస్ లండన్ లో స్థాపించడం జరిగింది.ఆమె నోట్స్ ఆన్ నర్సింగ్, నోట్స్ ఆన్ హాస్పిటల్స్ అనే గ్రంథాలను రచించారు. అంతర్జాతీయ స్థాయిలో నర్సింగ్ పై పేపర్ ప్రజంటేషన్స్ చేయడం జరిగింది. అప్పటినుండే నర్సులకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వడం అనే విధానం ప్రారంభించబడింది.ఆమెను ' మదర్ ఆఫ్ మోడ్రన్ నర్సింగ్' గా గుర్తించారు.ఆవిడ భారతదేశానికి కూడా ఇతోధిక సేవలు అందించారు. విక్టోరియా రాణి సూచనల మేరకు భారతదేశంలో జరుగుతున్న అధిక మరణాలకు కారణం సరైన శానిటరీ వ్యవస్థ లేకపోవడమే అని ఆవిడ గుర్తించి అవసరమైన శానిటరీ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మరణాల రేటును తగ్గించ గలిగింది.ఆవిడ మన మధ్య లేకపోయినా సేవానిరతి కలిగిన ప్రతి నర్సులోను ఆవిడ కలకాలం జీవించి ఉంటుంది. నర్సులు,రోగులు గుర్తుంచుకోవలసిన ఆదర్శమూర్తి 'ఫ్లోరెన్స్ నైటింగేల్ 'అని అన్నారు.నర్సింగ్ వృత్తి ఆవిర్భావానికి,గౌరవానికి ప్రతీక మరియు ఆవిడ అందించిన సేవలను దృష్టిలో ఉంచుకొని ఆవిడ గౌరవార్థం ఆవిడ జన్మదినమైన మే 12ను అంతర్జాతీయ నర్సుల దినోత్సవముగా ఒక ప్రత్యేక నినాదంతో నిర్వహించుకుంటున్నాము.ఈ సంవత్సరం'మన నర్సులు - మన భవిష్యత్తు,నర్సులే మన ఆర్థిక,సామాజిక శక్తి సంరక్షకులు'అనే నినాదంతో నిర్వహించుకుంటున్నాము అని తెలిపారు."ఈనాడు సమాజంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నర్సుల కొరత ఉంది.నేటి యువతీ యువకులు నర్సింగ్ కోర్సులలో ఉన్నత విద్యను అభ్యసించిన యెడల దేశ విదేశాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నందున దానిపై దృష్టి సారించాలి" అని కోరారు. ఈ సందర్భంగా నర్సులందరి చేత ఆవిడ జీవితాన్ని సేవానిరతిని ఆదర్శంగా తీసుకొని మనసా,వాచా, కర్మణా రోగులకు సేవలందిస్తాని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో దేవానంద్ యావద్,ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విజయలక్ష్మి,వాణీ సాంబశివరావు,జనార్ధన్, పాలం శ్రీను,ధర్మసాగర్, వెంకటేశ్వర్లు,బాలన్న,జిల్ మల్లేష్, ఎం.ఎస్ రావు, సంతోషి,లక్ష్మీ మరియు నర్సులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## పిఠాపురంలో పవనోత్సాహం...

### భారీ పోలింగ్ లెక్కలు ఏమి చెప్పబోతున్నాయి?

ఏపీలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. తెలంగాణతో పోలిస్తే ఏపీలో అత్యధికంగా పోలింగ్ నమోదైంది. ఈ సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ స్పెషల్ అట్రాక్షన్ గా మారిన నియోజకవర్గం ఏదైనా ఉందంటే ఠక్కున పిఠాపురం పేరు చెప్పేవారు! కారణం.. అక్కడ జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీలో ఉండటమే. అయితే తాజాగా పిఠాపురంలో పోలైన ఓట్ల పై ఆసక్తికర చర్చ తెరపైకి వచ్చింది. అవును... రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అత్యంత హాట్ టాపిక్ గా మారిన పిఠాపురం నియోజకవర్గంలో ఓటర్లు పోటెత్తారనే చెప్పాలి. గతంలో ఎన్నడూలేని విధంగా అన్నట్లుగా... ఈ ఎన్నికల వేళ పోలింగ్ ప్రక్రియ భారీగా సాగింది. ఈ అసెంబ్లీ స్థానం నుంచి పవన్ కల్యాణ్ పోటీ చేయడంతో ఓటర్లు తమదైన ఉత్సాహాన్ని ప్రదర్శించారని అంటున్నారు. అయితే... ఆ ఉత్సాహం పవన్ కు ఏస్థాయిలో ఉపయోగపడుతుండబోతుందనేది ఆసక్తిగా మారింది. ఈదఫా ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గంలో 86.63 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. ఇది కచ్చితంగా బెస్ట్ ఫిగరనే చెప్పాలి. కారణం... రాష్ట్ర విభజన అనంతరం ఈ స్థాయిలో పోలింగ్ జరిగింది ఇప్పుడే! 2014లో పిఠాపురం నియోజకవర్గంలో 79.44 శాతం పోలింగ్ నమోదవ్వగా.. 2019లో 80.92 శాతమని లెక్కలు చెబుతున్నాయి. దీన్నిబట్టి చూస్తే ఈసారి నమోదు ఎక్కువే.. దీనికి కారణం పవన్ పోటీ చేయడమే అని చెప్పేవారూ ఎక్కువే! వాస్తవానికి ఈసారి గాజువాక, భీమవరం కాకుండా పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించినప్పటినుంచీ ఈ నియోజకవర్గంపై అందరి దృష్టి నెలకొంది. ఇక జబర్దస్త్, సీరియల్స్, సినిమా నటీనటులు పవర్ స్టార్ కోసం స్టార్ క్యాంపెయినర్లుగా మారి క్షేత్రస్థాయిలో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో... పోలింగ్ రోజుకు ప్రధానంగా వృద్ధులు, మహిళలతో పాటు యువత, ఉద్యోగులు భారీగా క్యూకట్టారు. నాన్ లోకల్ అంశం కాసేపు పక్కనపెడితే... యువత, ఉద్యోగులు ప్రధానంగా పవన్ కోసమే ఈ స్థాయిలో పోటెత్తారని అంటున్నారు. ఈ భారీ పోలింగ్ కి కారణం పవనోత్సాహమే అనేది పరిశీలకుల మాటగా ఉంది. జూన్ 4న క్లారిటీ రానుంది!

## డెల్టా రైతుల నుదిటి రాతలు మార్చిన అసమాన్యుడు సర్ ఆర్థర్ కాటన్

- సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు



**విజయవాడ పశ్చిమ మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గోదావరి, కృష్ణా డెల్టాల రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ 221 వ జయంతి సందర్భంగా బుధవారం ఉదయం విజయవాడలోని జలవనరుల శాఖ ఆవరణలోని కాటన్ విగ్రహానికి సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర తదితరులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ.. 1852లో కాటన్ ధవళేశ్వరం దగ్గర గోదావరి నదిపై ఆనకట్ట నిర్మాణం పూర్తి చేసి ఆ ప్రాంత ప్రజల హృదయాల్లో అపర భగీరథుడు గా మిగిలి ఘనకీర్తిని సంపాదించుకున్నారని దేశ చరిత్రలో తొలిసారిగా కృష్ణ, గోదావరి డెల్టా లా వ్యవస్థను కాల్వల ద్వారా ఆయకట్టు,



డ్రైనేజ్ పద్ధతిలో నిర్మించి మార్గదర్శకులైనారన్నారు1840 లో నే కృష్ణానదిపై ఆనకట్ట ప్రతిపాదనలు బ్రిటీష్ ప్రభుత్వానికి పంపించి సిఫారసు చేయటమే కాకుండా ధవళేశ్వరం బ్యారేజ్ పూర్తి అయిన తర్వాత కృష్ణా నదిపై ఆనకట్టను నిర్మించారనారు. అందుకే గోదావరి, కృష్ణ డెల్టా ప్రాంత ప్రజలు దేవాలయాలకు వెళ్ళినప్పుడు మొదటిగా అన్నం పెట్టిన వాడే దేవుడిగా భావించి కాటన్ మహాశయుడిని స్మరించుకోవడం జరుగుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేని ఆ రోజుల్లోనే కాటన్ వందలాది మైళ్లు గుర్రంపై తిరిగి ఈ మహా యజ్ఞాన్ని పూర్తి చేశారని, ఈ ప్రాంత ప్రజలు తినే తిండిలో, తాగే నీటిలో, ఈ ప్రాంత అభివృద్ధిలో వెల్లివిరిసిన నాగరికతలో ఆయనే కనపడతారని, రైతు వ్యవసాయానికి అనుకూలంగా కృష్ణా, గోదావరి డెల్టాలను ఆధునికీకరణ చేసి నీటి వృధాను తగ్గించి, కాటన్ మహాశయుని ఆశయాలు కాపాడి మన ముందు తరాలకు అందించడమే ఆయనకు మనం అందించే నివాళి అన్నారు. కాటన్ ఇచ్చిన స్ఫూర్తితో గోదావరి నీటి వృధాను అరికట్టడానికి ఆంధ్రప్రదేశ్ లోని 13 జిల్లాల్లో 50 లక్షల ఎకరాలు ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగపడే ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును 194 టీఎంసీలు 45.72 మీటర్ల ఎత్తులో పూర్తిస్థాయిలో త్వరగా నిర్మించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచన చేశారు.

## ఇగ్నోజులై 2024 సెషన్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**విజయవాడ పశ్చిమ మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో జులై 2024 నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి ఆన్ లైన్ ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్, డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీ.జీ. డిప్లమా, డిప్లమా మరియు సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డి. ఆర్. శర్మ బుధవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీ 30 జూన్, 2024 అని తెలిపారు. పీ.జి రెండవ సంవత్సరం, డిగ్రీ రెండవ, మూడవ సంవత్సరం మరియు సెమిస్టర్ విధానం లో చదివే విద్యార్థులు రీ-రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్లైన్ ద్వారా జూన్ 30వ తేదీ వరకు చెల్లించవచ్చుని, అలాగే ఎస్ సి/ఎస్ టీ విద్యార్థులు బి. ఏ మరియు బి.కాం డిగ్రీ కోర్సులకు ఫీజు మినహాయింపుతో ఆన్లైన్ ద్వారా కొత్త అడ్మిషన్ మరియు రీ-రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చుని తెలిపారు. ఇతర వివరాలకు ఇగ్నో వెబ్ సైట్ (www.ignou.ac.in) ని గాని లేదా కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు అని తెలియచేసారు.

## ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు హౌస్ అరెస్టు

### పల్నాడు జిల్లాలో భారీగా బలగాల మోహరింపు



**మాచర్ల :మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతోంది. పోలింగ్ అనంతరం జరుగుతున్న దాడుల నేపథ్యంలో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. కారంపూడి, కొత్త గణేషునిపాడులో హింసాత్మక ఘటనలు జరిగినందున బలగాలను మోహరించారు. జిల్లాలోని మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాలపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మొత్తం 19 కంపెనీల బలగాలను మోహరించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మాచర్లలోనే ఉండి పర్యవేక్షిస్తున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ కూడా అక్కడే ఉన్నారు. మాచర్లలో అడుగడుగునా పోలీసులు మోహరించారు. పట్టణంలోకి వచ్చేవారి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో వైసీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. గురజాలలో కాసు మహేశ్‌రెడ్డి, నరసరావుపేటలో గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ముగ్గురి కంటే ఎక్కువమంది గుమిగూడవద్దని ఎస్పీ బిందుమాధవ్ హెచ్చరించారు. సామాన్యుల జీవనానికి ఆటంకాలు కలిగించబోమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

## కె బి ఎన్ కళాశాల చరిత్రలోనే కీర్తి కిరీటం సాధించిన ఘనత భారత్ కుమార్ ది

### దేశానికి కీర్తి తీసుకొచ్చిన కేబీఎన్ విద్యార్థి భరత్‌కుమార్



**విజయవాడ పశ్చిమ మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**చైనాలో జరిగిన ఎషియన్ యూనివర్శిటీ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన కేబీఎన్ కళాశాల విద్యార్థి భరత్‌కుమార్ ప్రతిభ దేశానికే గర్వకారణమని ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. కె బి ఎన్ కళాశాల సిగలో కీర్తి కిరీటాన్ని అందించిన సందర్భంగా కళాశాల కమిటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న పీ భరత్‌కుమార్ ఇటీవల చైనాలోని





హంకాంగ్‌లో ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. ఆ క్రమంలో వివిధ అంశాల్లో జరిగిన పోటీల్లో అత్యంత ప్రతిభావంతంగా తన ప్రతిభను ప్రదర్శించారని పేర్కొన్నారు. స్క్వాడ్, బెంజ్‌ప్రెస్, డెడ్‌లిఫ్ట్‌లలో మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడన్నారు. అంతేకాకుండా తప కేటగిరిలో మొదటి స్థానంలో నిలిచినందున మరొక బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడని వివరించారు. అదేవిధంగా అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్నందుకు ఒక వెండి పతకం భరత్‌కుమార్‌కు లభించిందన్నారు. తద్వారా తమ కళాశాల కీర్తినే కాకుండా రాష్ట్రానికి, దేశానికి కూడా పేరుప్రఖ్యాతలను తీసుకొచ్చారని వివరించారు. తమ కళాశాల విద్యతో పాటుగా క్రీడా, సాంస్కృతిక రంగాల్లోనూ విద్యార్థులను ప్రోత్సాహిస్తుందని వివరించారు. క్రీడా విభాగ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ భరత్‌కుమార్ 2022లోనూ టర్కీలో జరిగిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బ్రాంజ్ మెడల్‌ను సాధించారని వివరించారు. భరత్‌కుమార్ ప్రతిభను గుర్తించి తమ కళాశాల యజమాన్యం 2022లో, ప్రస్తుతం చైనాలో జరిగిన పోటీలకు సంబంధించి లక్షలాది రూపాయాల ఆర్థిక సాయాన్ని అందించి అండగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌ను అతనిని తీర్చిదిద్దిన కళాశాల క్రీడా విభాగాధిపతి డీ హేమచంద్రరావులను అభినందించారు. హేమచంద్రరావు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రమంలో అనేక అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బరువు, అవతల పోటీదారుని పరిస్థితులు వంటి అంశాలను పరిశీలించి ఎప్పటికప్పుడు భరత్‌కుమార్‌కు పర్యవేక్షించామన్నారు. కళాశాల తోడ్పాటుతో విజయాలు : భరత్‌కుమార్ పవర్‌లిఫ్టర్‌గా నా ప్రతిభను పరిశీలించి కళాశాల యజమాన్యం అన్ని విధాలుగా అండగా ఉండటం వలనే పలు విజయాలను అందుకున్నట్లు భరత్‌కుమార్ పేర్కొన్నారు. అదేవిధంగా చైనాలో జరిగిన పోటీలకు, గతంలో టర్కీలో జరిగిన పోటీలకు కళాశాల చాలా ప్రోత్సాహిచిందని వివరించారు. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలను సాధించేందుకు పాటుపడతానని భరత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిటీ ప్రముఖులు చెవిటి శ్రీనివాసులు గ్రంధి పవన్ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నాయకుల పై దాడి దుర్మార్గం- శంకర్ నారాయణ

**అనంతపురం మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అనంతపురం జిల్లాలో వైఎస్ఆర్ సిపి నాయకుడు ఆదినారాయణ పై టిడిపి నాయకులు దాడి దుర్మార్గమని బుధవారం అనంతపురం వైఎస్ఆర్ సిపి పార్లమెంట్ అభ్యర్థి మాలగుండ్ల శంకర్ నారాయణ తెలియజేశారు. టిడిపి నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన ఆదినారాయణను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎంపి అభ్యర్థి శంకర్ నారాయణ పరామర్శించడం జరిగింది. వైసిపి నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో మరోసారి జగన్ సిఎం అవబోతున్నారని అన్నారు.

## 'ప్రైవేటు' దోపిడీ....

- ప్రైవేట్,కార్పొరేట్ స్కూల్స్ లో పుస్తకాల పేరుతో నిలువు దోపిడీ...
- స్కూల్లోనే పుస్తకాలు కొనాలని పేరెంట్స్ ని ఒత్తిడి చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలు
- పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల స్టాల్స్ ఏర్పాటు
- పట్టించుకోని ఉన్నత విద్యాశాఖ అధికారులు










**మైలవరం,మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఉమ్మడి కృష్ణా(ఎన్టీఆర్)జిల్లాల్లోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను అతిక్రమిస్తున్నాయి. స్కూల్‌లోనే పుస్తకాలు కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారు. ఏకంగా స్కూళ్లల్లోనే స్టాల్స్ ఏర్పాటు చేశారు. బుక్స్ తో పాటు యూనిఫాం, టై, బెల్టులు తమ వద్దనే కొనాలంటున్నారు. పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్, యూనిఫాం, టై, బెల్టుల అమ్మకాలతో ప్రైవేట్ పాఠశాలలు బయట దుకాణాలను తలపిస్తున్నాయి. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మార్చారు. విద్యా అనే వ్యాపార ముసుగులో విద్యార్థుల తల్లిదండ్రులు కొట్టుమిట్టులాడుతున్నారు. అక్షరాలు నేర్వని నర్సరీ పిల్లలకు కూడా వేలకు వేలు కట్టించుకొని పుస్తకాలు అంటగడు తున్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నత విద్యాశాఖ అధికారులు,పాలకులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పూర్తి స్థాయి వసతులున్న పాఠశాలలను వేళ్లమీదే లెక్కపెట్టవచ్చు. సరైన మౌలిక వసతులు లేక, విద్యార్థులకు సరిపడా ఆటస్థలాలు లేక , తరగతి గదుల కొరత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, విద్యా శాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా యాజమాన్యాలు ఫీజుల వసూళ్లలో మాత్రం తగ్గేదేలే అంటున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల పేరుతో తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు. నిబందనల ప్రకారం ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్యను బట్టి ఎంఈవో కార్యాలయం ద్వారా వీరు పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టీ తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సిహొ ఉంటుంది. అయితే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమకు సంబందించి న పాఠ్యపుస్తకాలకు, నోటు పుస్తకాలకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు నగదు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ. 250 నుంచి రూ. 650 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. 8,9,10 తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉన్నా గరిష్ఠంగా రూ. 1500 లకు మించి ఉండదు. అన్ని కలిపి పుస్తకాల ఖర్చు రూ. 2 వేలకు మించి ఉండదు. అయితే ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. నర్సరీ, ఎల్ కె జి తరగతులకే రూ. 3 వేలు వసూలు చేస్తుండగా, 8,9,10 తరగతులకు రూ. 8 వేల నుంచి రూ. 9 వేల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూలీ నాలి చేసైనా పిల్లలకు నాణ్యమైన విద్యను అందించా లన్న తపన తల్లిదండ్రులలో ఉన్నా వారికి పాఠశాలల్లో పుస్తకాలు కొనుగోలు పెనుభారంగా మారింది. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. విద్యార్థులకు అవసరం లేని స్టడీ మెటీరియల్, నోట్ పుస్తకాలను విక్రయిస్తుండటం వల్ల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోంది. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు స్టడీ మెటీరియల్ అంటూ విద్యార్థులకు అంటగడుతున్నారు. పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను ఉపాధ్యాయులచే చెప్పించి నోట్స్ రాయించాల్సిన యాజమాన్యాలు స్టడీ మెటీరియల్ అంటూ రూ. వేలల్లో వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా విద్యా శాఖ అధికారు లు స్పందించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాల పేరుతో చేపడుతున్న వసూళ్ల దందాను అరికట్టాలని విద్యార్థు ల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని కనకదుర్గమ్మ గుడికి కాలినడక



**ఇబ్రహీంపట్నం మే 15(వార్తా ప్రభ ప్రతినిధి): –**ప్రజలందరికి మంచి జరిగే విధంగా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల విజయం సాధించి తిరిగి ముఖ్యమంత్రి కావాలని, మైలవరం లో సర్నాల తిరుపతిరావు ఎమ్మెల్యేగా గెలుపొందాలని ఆకాంక్షిస్తూ కొండపల్లి ఇందిరానగర్ నుండి విజయవాడ కనకదుర్గమ్మ గుడికి పాదయాత్ర నిర్వహించారు వైఎస్ఆర్సిపి నాయకులు అవులూరి వెంకట రామిరెడ్డి, తుమాటి దుర్గ చారి మరియు సందేప్. కొండపల్లి నుండి కాలినడకన విజయవాడ కనకదుర్గమ్మ గుడికి చేరుకొని అక్కడ తలనీలాలు సమర్పించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మరోసారి అందరికీ మంచి జరిగేలా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, మైలవరంలో సర్నాల తిరుపతిరావు మంచి మెజార్టీతో గెలుపొందాలని అమ్మవారికి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని వారిని అభినందించారు.

# కూటమికి 130 స్థానాలు ఖాయం


## – స్పష్టం చేసిన బూరగడ్డ వేదవ్యాస్



**పెడన మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రంలో 130 పైబడి స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలవబోతున్నారని మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ స్పష్టం చేశారు.మచిలీపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు.ఎన్నడూ లేని విధంగా ఓటర్లు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.వైసీపీ దురాఘత ప్రభుత్వాన్ని పారదోలాలన్న కసి ఓటర్లలో కనిపించిందన్నారు.గతంలో ఎన్నడూ లేని చైతన్యం ఓటర్లలో కనిపించిందన్నారు.దేశ విదేశాల్లో ఉన్న వారు కూడా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వచ్ఛందంగా స్వగ్రామాలకు వచ్చారన్నారు.ఇదంతా వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతోనే అని వేదవ్యాస్ అన్నారు

# స్ట్రాంగ్ రూమ్ వద్ద సీఎం జగన్ సెక్యూరిటీ సిబ్బంది పార్టీ

## ఈసీకి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఫిర్యాదు



**అమరావతి, మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**: ఎన్నికల నిబంధనలను సీఎం (అపద్ధర్మ) జగన్ రెడ్డి సెక్యూరిటీ తుంగలో తొక్కారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీ స్ట్రాంగ్ రూమ్ వద్ద సీఎం సెక్యూరిటీ సిబ్బంది పార్టీ నిర్వహించారు. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనాకి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఫిర్యాదు చేశారు. నాగార్జున యూనివర్సిటీ స్ట్రాంగ్ రూమ్ వద్ద ఎన్నికల నిబంధనలను సీఎం సెక్యూరిటీ సిబ్బంది ఉల్లంఘించారని అన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా "సిద్ధం" పోస్టర్‌తో, అధికార వైసీపీ డీజే పాటలతో పార్టీ నిర్వహించారని చెప్పారు. ఈ పార్టీలో 450 మందికిపైగా పోలీసు అధికారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ పార్టీ నిర్వహించిన సీఎం సెక్యూరిటీ గ్రూప్ ఎస్పీ అత్తాడ బాపూజీపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. మరియు స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సీఈఓ ఎంకే మీనాను చంద్రబాబు కోరారు.

# ఏపీ సీఐడీ వేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టు విచారణ

## –లోకేష్ వ్యాఖ్యలు పై ఏసీబీ కోర్టు సీరియస్

**విజయవాడ, మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఏపీ ఏసీబీ కోర్టులో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ రెడ్ బుక్ కేసుపై బుధవారం విచారణ జరిగింది. నారా లోకేష్‌ను అరెస్ట్ చేయాలని ఏపీ సీఐడీ వేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టు విచారణ చేపట్టింది. రెడ్ బుక్‌లో ప్రభుత్వ అధికారుల పేర్లు ఉన్నాయని బెదిరిస్తూ 41ఏ నిబంధలకు విరుద్ధంగా లోకేష్ వ్యవహరిస్తున్నారని సీఐడీ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. కౌంటర్, అబ్జెక్షన్లు వినేందుకు సమయం ఇవ్వాలని న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ కోరారు. ఈ కేసు విచారణను జూన్ 18కి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. కాగా నారా లోకేష్ గత ఏడాది యువగళం పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ సమయంలో లోకేష్ రెడ్ బుక్ – రెడ్ బుక్ అంటూ కామెంట్లు చేశారు. కొంత మంది ఏపీ పోలీసులు, సీఐడీ అధికారులు టీడీపీ నాయకులపైనా, తనపైనా దాడులు చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం చెప్పినట్లే అధికారులు నడుచుకుంటున్నారని వీరిపై టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని నారా లోకేష్ హెచ్చరించారు. వీరి పేర్లను ఈ రెడ్ బుక్‌లో నమోదు చేస్తున్నానని లోకేష్ చెప్పారు. అయితే ఈ వ్యాఖ్యలను ఏసీబీ కోర్టు సీరియస్‌గా పరిగణించింది.

# పుట్టపర్తి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలుస్తాం: పల్లె



**పుట్టపర్తి మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పుట్టపర్తి నియోజకవర్గం, లో అత్యధిక మెజారిటీతో గెలుస్తున్నామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి లోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వృద్ధులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరడం, స్వచ్ఛందంగా ఓటర్లు ఓటు వేయడాన్ని గమనిస్తే టీడీపీ అధిక మెజారిటీతో గెలుస్తుంది అన్నారు.

# రికార్డు స్థాయిలో విజయం సాధించబోతున్న నారా లోకేష్

- గెలుపు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆహర్నిశలు శ్రమించారు
- నారా లోకేష్ విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రజలు నారా లోకేష్‌కు ఓట్లు వేశారు
- అందరి ఆదరణ ఆశీస్సులతో త్వరలోనే కూటమి ప్రభుత్వం
- అర్ధరాత్రి వరకూ ఓటింగ్ జరగడమే ఇందుకు నిదర్శనం



**మంగళగిరి, మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మంగళగిరి నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన నారా లోకేష్ మంగళగిరి చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయి మేజార్టీతో విజయం సాధించబోతున్నారని నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య స్పష్టం చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నందం అబద్దయ్య మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా నియోజకవర్గ ప్రజలు నారా లోకేష్‌కు ఓట్లు వేశారని అన్నారు. నారా లోకేష్ విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారులు, సిబ్బంది, పోలీసులు, జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. నారా లోకేష్ గెలుపు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆహర్నిశలు శ్రమించారన్నారు. రాత్రి, పగలు శక్తి వంచనలేకుండా కష్టపడ్డారని, అన్ని వార్డులు, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ప్రచారంలో అన్ని వర్గాల ప్రజలు నారా లోకేష్‌కు ఆదరణ చూపారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. గతంలో ఎప్పుడు ఓటు వేయని వారు, కొత్తగా ఓటు వచ్చిన వారు కూడా చంద్రబాబు నాయుడును సీఎం చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. మంగళగిరిలో మొట్ట మొదటిసారి 85.74 శాతం పోలింగ్ నమోదు కావడం సంతోషించదగ్గ విషయమన్నారు. అందరి ఆదరణ ఆశీస్సులతో త్వరలోనే కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో నారా లోకేష్, పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఓటు వేసేందుకు రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, ఒడిస్సా తదితర రాష్ట్రాలు, విదేశాల నుంచి ఎంతో మంది స్వచ్ఛందంగా తరలి వచ్చారని, అర్ధరాత్రి వరకూ ఓటింగ్ జరగడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఒక్క ఛాన్స్ పేరుతో జగన్ అన్ని రకాలుగా రాష్టాన్ని సర్వనాశనం చేశాడని ధ్వజమెత్తారు. నారా లోకేష్ నియోజకవర్గాన్ని ఒక రోల్ మోడల్‌గా అభివృద్ధి చేస్తారని చెప్పారు.రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించి ప్రజా సంక్షేమ పాలన కోసం పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు ప్రభంజనంలా తరలివచ్చి కూటమికి ఓటు వేశారన్నారు. జగన్ ఐదేళ్లలో మేనిఫేస్టోలో ఇచ్చిన హామీలను అరకొర అమలు చేసి రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుందని అన్నారు. చంద్రబాబునాయుడు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్న నమ్మకంతో ప్రజలు ఓటు వేశారన్నారు. కూటమి అధికారంలోకి వస్తే అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన ఎంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు మాట్లాడుతూ వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటును వినియోగించుకోవడం హర్షణీయమన్నారు. నారా లోకేష్ 29 సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. నారా లోకేష్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తారన్నారు. కూటమి మేనిఫెస్టో పథకాలను పార్టీలకతీతంగా ప్రజలకు అందించేందుకు నారా లోకేష్ కృషి చేస్తారన్నారు. నారా లోకేష్ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మంగళగిరి పట్టణ పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు, మంగళగిరి మండల పార్టీ అధ్యక్షులు తోట పార్థసారథి, పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, జనసేన ఎంటీఎంసీ కార్యదర్శి తిరుమలశెట్టి మురళీకృష్ణ, నియోజకవర్గ ఐటీడీపీ నాయకులు సుధీర్ తదితరలు పాల్గొన్నారు.

# నేటి నుంచి టీబి నివారణ టీ కా పంపిణీ కార్యక్రమం!!!

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతా భాయి వెల్లడి!!!



**మచిలీపట్నం మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం రాష్ట్రంలో 2025 నాటికి టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే కార్యక్రమంలో భాగం గా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నేటి నుండి టీబి నివారణకు సంబంధించిన టీకా కార్యక్రమము పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని నేడు జియో మీట్ కార్యక్రమం ద్వారా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు, వైద్యారోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రత్యేక సమన్వయ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం ,జిల్లా టీబి నియంత్రణ అధికారి డాక్టర్ ఏ. వెంకట్రావు ,జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ .సీతాకుమారి ,ఇతర జిల్లా ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఈ టీబి టీకా నియంత్రణ పంపిణీ కార్యక్రమం 18 సంవత్సరముల వయసు పైబడిన వారందరూకు ఇవ్వటం జరుగుతుంది. గతంలో పుట్టిన వెంటనే బిడ్డకు ఇచ్చే బీసీజీ టీ కా వలన వారికి 18 సంవత్సరాల వయసు వచ్చేంతవరకు వ్యాధి నిరోధక శక్తి కలిగి ఉంటారు .కావున ఆ తదుపరి వ్యాధి నిరోధక శక్తిని బూస్టప్ చేయుటకు ఈ టీకాని ప్రవేశ పెట్టడం జరిగింది. ఇది ముఖ్యంగా 18 సంవత్సరాల పైబడి గత 5 సంవత్సరముల క్రితం టీబి కి సంబంధించిన మందులు వాడిన వారికి, టీబి వ్యాధిగ్రస్తులతో నివాసం ఉన్నవారికి ,60 సంవత్సరములు పైబడిన వారికి ,షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగ త్రాగే వారికి మరియు బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువ ఉన్నవారికి ముఖ్యంగా ఈ టీకాలు ఇవ్వటం జరుగుతుంది. అదేవిధంగా బాలింతలకు, పాలిచ్చు తల్లులకు ,ప్రస్తుతం టీబి మందులు వాడుతున్న వారికి, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ,క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ,డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు ఈ టీకాను ఇవ్వటం జరగదు. కావున ఈ టీకాలు నేటి నుండి మూడు నెలల పాటు ప్రతి గురువారం మీ సమీప సచివాలయాలలో ఇవ్వడం జరుగుతుంది. ముఖ్యంగా మన జిల్లాలో ఉన్న 508 సచివాలయ కేంద్రాలలో ప్రతి గురువారం , మూడు నెలలపాటు ఈ వ్యాధి నిరోధక శాఖలు ఇవ్వడం జరుగుతుంది. ప్రతి సచివాలయానికి వంద మంది చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించడం జరుగుతుంది .మన జిల్లాకు సంబంధించి 50 వేల మందికి ఈ టీబి నియంత్రణ టీకా ను ఇవ్వటానికి లక్ష్యంగా నిర్దేశించడం జరిగింది. ముందుగా ప్రతి ఒక్కరి నుండి అనుమతి తీసుకొని వారి అనుమతి తోటి మాత్రమే ఈ టీకా ను ఇవ్వటం జరుగుతుంది. తదుపరి టిబి విన్ పోర్టల్ నందు నమోదు చేయవలెను ఆదే సమాచారం జిల్లా కేంద్రానికి పంపించవలసిందిగా ఆదేశించడం జరిగింది. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మరియు ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో నిర్వహించడం జరుగుతుంది .కావున ప్రజలందరూ అర్హులైన వారు తమ సమీప సచివాలయ కేంద్రాలకు వచ్చి ఈ టీబి నియంత్రణ టీకా కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని డాక్టర్ జి. గీతా బాయి తెలియజేసినారు.

# ఏపీ ఎన్నికల్లో ప్రముఖుల నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం ఇలా

- చంద్రబాబు పోటీ చేసిన కుప్పం నియోజకవర్గంలో 85.87 శాతం పోలింగ్
- వైఎస్ జగన్మోహన్ రెడ్డి పోటీ పడిన పులివెందులలో 81.34 శాతం పోలింగ్ నమోదు
- జనసేనాని పవన్ కల్యాణ్ బరిలో నిలిచిన పిఠాపురం నియోజకవర్గంలో 86.36 శాతం ఓటింగ్



**వెలగపూడి మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** : ఏపీలో ఈసారి భారీగా పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే. బుధవారం సీఈఓ ముకేశ్‌కుమార్ మీనా ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించి రాష్ట్రంలో నమోదైన పోలింగ్ వివరాలను వివరించారు. రాష్ట్రంలో మొత్తంగా 81.86 శాతం పోలింగ్ నమోదయినట్లు తెలిపారు. ఇందులో ఈవీఎంల ద్వారా 80.66 శాతం, పోస్టల్ బ్యాలెట్‌తో 1.2 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు. గత ఎన్నికలతో పోలిస్తే 2.09 శాతం పోలింగ్ పెరిగిందని మీనా తెలిపారు. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్, టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, నందమూరి బాలకృష్ణ వంటి ప్రముఖులు పోటీ చేసిన వారి వారి నియోజకవర్గాల్లో ఎంత శాతం పోలింగ్ నమోదయిందనే వివరాలను తెలుసుకుందాం. మాజీ సీఎం చంద్రబాబు పోటీ చేసిన కుప్పం నియోజకవర్గంలో 85.87 శాతం పోలింగ్ నమోదయింది. ఇక ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పోటీ పడిన పులివెందులలో 81.34 శాతం పోలింగ్ నమోదైతే, జనసేనాని బరిలో నిలిచిన పిఠాపురం నియోజకవర్గంలో 86.36 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. టీడీపీ యువనేత నారా లోకేశ్ పోటీ చేసిన మంగళగిరిలో 85.74 శాతం ఓటింగ్ జరిగింది. అలాగే నందమూరి బాలకృష్ణ బరిలో ఉన్న హిందూపూర్ నియోజకవర్గంలో 77.82 శాతం పోలింగ్ నమోదు కాగా, షర్మిల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన కడపలో 78.73 శాతం పోలింగ్ జరిగింది.

# హిందూపురంలో రెండు రోజులు నీటి సరఫరా బంద్



**హిందూపురం మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హిందూపురం పట్టణంలో రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు హిందూపురం మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఎస్. కే. డి. వాటర్ లిఫ్టింగ్ స్టేషన్ వద్ద గల ట్రాన్స్ ఫార్మర్ పానెల్ బోర్డులో మరమ్మతుల కారణంగా రెండు రోజులు నీటికి అంతరాయం కలుగుతుందని ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించాలని సూచించారు.

# ఐదేళ్ల హింస రాజకీయానికి ప్రజలు స్వస్తి చెప్పారు

## రాష్ట్రంలో వైసీపీ మూకలు చేస్తున్న దాడులు, అరాచకాలు దౌర్జన్యాలపై రాష్ట్ర గవర్నర్ కు ఎన్డీఏ నేతల ఫిర్యాదు



**విజయవాడ :మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రెండు రోజులుగా రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న దాడులు దౌర్జన్యాలు అరాచకాలపై గవర్నర్ అబ్దుల్ నజీర్ కి ఫిర్యాదు చేసిన కూటమి నేతలు. ఓడిపోతున్నామని భయంతోనే అధికార వైసిపి ఈ దాడులు చేయిస్తుందని గవర్నర్ కు కూటమి నేతలు తెలియజేశారు. వీటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, నశించిపోయిన శాంతి భద్రతలను తిరిగి పునరుద్ధరించాలని కూటమి నేతలు గవర్నర్ ను కోరారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడారు.

**వైసీపీ గూండలు రోడ్లపైకి వస్తే పోలీసులు చోద్యం చూశారు : వర్ల రామయ్య** "ప్రభుత్వ అరాచకాలనీ ఎదుర్కొని ఒటు హక్కును వినియోగించుకున్నవారందరికి కూటమి తరపున కృతజ్ఞతలు. రాష్ట్రంలో నశించిన శాంతిభద్రతలు, ప్రభుత్వ దౌర్జన్యాలు, మా పై జరిగిన అరాచకత్వాన్ని గవర్నర్ కు వివరించాం. పోలీసులు, పోలీసు అధికారులు వ్యవహరించిన తీరు గురించి చెప్పాం. మాచర్ల, తాడిపత్రి, చంద్రగిరి, పూతలపట్టు, నరసరావుపేట ఇలా అనేక చోట్ల పోలీసులు వైకాపాతో మిలాఖాత్ అయి టీడీపీ నాయకులపై, ప్రజలపై దాడులు, దౌర్జన్యాలు చేశారు. వీటన్నిటిపైనా చర్యలు తీసుకోవాలి అని గవర్నర్ ను కోరాము. రాడ్లు, కర్రలు, పెట్రోల్ క్యాన్లతో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా తిరుగుతుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారు. ఆధారాలతో సహా గవర్నర్ కు సమర్పించాం. గవర్నర్ కూడా ఆశ్చర్యపోయారు. పిన్నెల్లి సోదరులు చేసిన అరాచకం సినిమాలను తలపించేలా ఉన్నాయి. కళ్ళకు కట్టినట్లుగా గవర్న్ గారికి చూపించాం. వైసీపీకి ఓటు వేయలేదా కొట్టండి అని, వీడు మన పార్టీ కాదు కొట్టండని వైసీపీ మూకలు దాడులు చేశారు. వాళ్ళు చేసిన దౌర్జన్యాలు అన్నీ ఇన్ని కావు. వీరి దౌర్జన్యాలు చూస్తుంటే మనం భారతదేశంలో ఉన్నామా లేక ఇస్లామిక్ దేశంలో ఉన్నామా అని అనుమానం కలుగుతోంది. చంద్రగిరిలో పులివర్తి నాని ని కొట్టి చంపడానికి ప్రయత్నించారు. తాడిపత్రిలో పెద్దారెడ్డి ఇష్టం వచ్చినట్లు వ్యవహారించాడు. వీటన్నింటిపైన తప్పకుండా చర్యలు తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఇలాంటివి జరగకుండా చూస్తానని కూడా గవర్నర్ హామీ ఇచ్చారు. గవర్నర్ చాలా సౌమ్యంగా వ్యవహరించారు. ఆయన దృష్టికి ఇలాంటివి అనేకం వచ్చినట్లు చెప్పారు. అసమర్ధ పోలీసుల పైన కూడా చర్యలు తీసుకుంటామన్నారు. అధికార పార్టీతో ఎవరు లాలూచీ పడ్డారో, చేతులు కలిపారో ఆ పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటామని గవర్నర్ అన్నారు. ఎవరైతే ఎన్నికల విధులను లోపభూయిష్టంగా వ్యవహరించారో వారందరిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన హామీ ఇవ్వడంతో మేము చాలా సంతోషించాం. జగన్మోహన్ రెడ్డి ఆటలు ఇక సాగవని వర్ల హేచ్చరించారు.

**నిరాశ నిస్పృహల వల్లే వైసీపీ దాడులు : మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు** "ప్రభుత్వ అధికారులు పూర్తిగా ఎన్నికల నిర్వహణలో వైఫల్యం చెందారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం కూడా శాంతిభద్రతలు లోపించాయి. రాష్ట్రంలో అరాచకం పోవాలి. రాష్ట్ర నలుమూలల నుంచే కాదు దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఓటర్లు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం పోవాలి. ఐదు గంటలు 6 గంటలు వేచి ఉండి, అర్ధరాత్రి రెండు గంటల వరకు కూడా నిలబడి ఓటు హక్కు వినియోగించుకోవడానికి నిలబడ్డారుంటే వైసీపీ పట్ల ప్రజలకు ఉన్న వ్యతిరేకతే నిదర్శనం. రాష్ట్రం కోసం, ప్రజాస్వామ్యం కోసం ప్రజలు ఓట్లు వేశారు. ఇది చూసి తట్టుకోలేక వైసీపీ నాయకులు బూతుల దగ్గర గొడవలు సృష్టించారు. రెచ్చగొట్టే కార్యక్రమాలు చేశారు. ఓటర్లను బెదిరింపులకు పాల్పడ్డారు. పలనాడు జిల్లాలో హింసాత్మకమైన సంఘటనలు జరిగాయి. దాడులు చేస్తున్నా, పెట్రోల్ పోసి తగలబెడుతున్నా పోలీసులు పట్టించుకోలేదు. బూతులు వద్ద పోలీసు బందోబస్తు లేదు. పెట్రోలింగ్ లేదు. బూతులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారు. తాడిపత్రి స్ట్రాంగ్ రూమ్ పక్కనే పులివర్తి నాని పై దాడి జరిగింది.

**రాష్ట్రంలో అవినీతి పరిపాలన రాజ్యమేలింది : టీడీపీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి**

రాష్ట్ర ప్రజానీకం ఎప్పుడూ లేనివిధంగా ఎన్నికల్లో పాల్గొని ఓట్లేశారు. లైన్లలో మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకు నిల్చొని ఓట్లేశారు. అయితే వైసీపీ నాయకులు అరాచకాలు సృష్టించారు, ఎప్పుడు ఇలాంటి అరాచకాలు జరగలేదు. పలనాడు ప్రాంతంలో వైసీపీ అభ్యర్థులు, పార్లమెంటు పోటీ చేస్తున్న అనిల్ కుమార్ యాదవ్ వారి అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. ఎన్నికల ముందు నుంచే గ్రామాల్లోకి వెళ్లి భయభ్రాంతానికి గురి చేశారు. వారు ఓట్లు అడిగే పరిస్థితి లేదని గ్రహించి ప్రజల్ని రెచ్చగొట్టడం మొదలు పెట్టారు. కక్షలు, కార్పన్యాలను ప్రేరేపించారు. పలనాడు ప్రాంతం ప్రశాంతమైన వాతావరణం. నిప్పు రాజేశారు. అరాచకాలు సృష్టించారు. ఇప్పటికైనా కక్షలు కార్పణ్యాలను నివారించాలని డిమాండ్ చేశారు.

# జూన్ 15న పూర్వ విద్యార్థులతో ప్రత్యక్ష సంభాషణ

● "జడ్.పి. ఉన్నత పాఠశాల నుండి జాతీయ పోలీసు అకాడమీ వరకు తన ప్రయాణం" పై విద్యార్థులతో మాట్లాడనున్న మహిళా ఐ.పి.ఎస్ అధికారిణి శాలి గౌతమి ● యూట్యూబ్ ఛానెల్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ల ద్వారా పరస్పర చర్చా కార్యక్రమం ● ఈ కార్యక్రమానికి నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనున్న రాష్ట్ర విద్యా నిర్వహణ, శిక్షణ సంస్థ ● పూర్వ విద్యార్థులతో పరస్పర చర్యలు విద్యార్థుల జీవితాలపై విద్యాపరమైన ప్రభావాన్ని చూపించే అవకాశం ఉందని పలు పరిశోధనలు వెల్లడి ● -పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

**విజయవాడ మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** : పూర్వ విద్యార్థులతో ప్రస్తుత విద్యార్థులకు ప్రత్యక్ష సంభాషణ కార్యక్రమం నిర్వహించడం ద్వారా అనేక విద్యాపరమైన ప్రయోజనాలున్నాయని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా, వారిని మరింత ప్రోత్సహించే లక్ష్యంతో జూన్ 15వ తేదీ, శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పూర్వ విద్యార్థులతో ప్రత్యక్ష సంభాషణ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించామని వెల్లడించారు.



ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణపై జిల్లా విద్యా శాఖాధికారులు, జిల్లా వృత్తి విద్యా శిక్షణాధికారులకు పలు సూచనలు చేశారు. జడ్.పి. ఉన్నత పాఠశాల నుండి జాతీయ పోలీసు అకాడమీ వరకు తన ప్రయాణం, ఎదిగిన విధానం, ఎదుర్కొన్న పరిస్థితులు, తలెత్తిన సవాళ్లు, విజయాలపై 2015 బ్యాచ్ కు చెందిన మహిళా ఐ.పి.ఎస్ అధికారిణి, ప్రస్తుతం విశాఖపట్టణం, 16వ బెటాలియన్ కు చెందిన కమాండెంట్ శాలి గౌతమి ప్రసంగిస్తారని, అనంతరం విద్యార్థులతో యూట్యూబ్ ఛానెల్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ల ద్వారా మాట్లాడనున్నారని ప్రవీణ్ ప్రకాష్ వెల్లడించారు. గౌతమి తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామంలోని జిల్లా పరిషత్ స్కూల్ లో 10వ తరగతి పూర్తి చేసుకుందని తెలిపారు. 6-10వ తరగతి చదువుతున్న విద్యార్థులు తరగతి గదుల్లోని ఐఎఫ్ పీల ద్వారా కార్యక్రమాన్ని చూడటంతో పాటు ప్రసంగాన్ని విన్న తర్వాత ఉపాధ్యాయుల సహాయంతో వాట్సాప్ ద్వారా ప్రశ్నలు పంపిస్తే ప్రత్యక్షంగా గౌతమి వారి ప్రశ్నలకు సమాధానాలు అందిస్తుందన్నారు. ప్రస్తుత విద్యార్థులకు గొప్ప రోల్ మోడల్‌లు గా, తమ భావి జీవితానికి పూర్వ విద్యార్థుల అనుభవం ఒక పాఠంగా ఉపయోగపడుతుందని తాము భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం అనంతరం వచ్చే అభిప్రాయం ఆధారంగా భవిష్యత్ లో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమానికి అవసరమైన ఇంటర్నెట్, ఐఎఫ్ పీలను సంసిద్ధంగా ఉంచుకునేలా కళాశాల ప్రిన్సిపల్స్ కు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించాలని జిల్లా విద్యా అధికారులు, జిల్లా వృత్తి విద్యా శిక్షణాధికారులకు తెలిపారు. రెసిడెన్షియల్ విద్యా సంస్థల విద్యార్థులు సైతం కార్యక్రమంలో పాల్గొనేలా సమాచారం చేరవేయాలని జిల్లా విద్యా అధికారులకు సూచించారు. రాష్ట్ర విద్యా నిర్వహణ, శిక్షణ సంస్థ ను ఈ కార్యక్రమానికి నోడల్ ఏజెన్సీగా నియమించడం జరిగిందని, వారు తమ యూట్యూబ్ ఛానల్ లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారన్నారు. వెస్టర్న్ కెంటక్కి విశ్వవిద్యాలయానికి చెందిన ఆరన్ డబ్ల్యూ. హగ్వే "విద్యార్థి జీవితంలో పూర్వ విద్యార్థుల సంఘం యొక్క పాత్ర" అనే అంశంపై నిర్వహించిన పరిశోధనలో విద్యార్థులు తమ సంస్థ యొక్క పూర్వ విద్యార్థులతో సంభాషించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తేలిందని ప్రవీణ ప్రకాష్ గుర్తుచేశారు. అదే విధంగా 2018-19లో కాలిఫోర్నియా శాన్ డియాగోలో ఉన్న సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఎడ్యుకేషనల్ ఈక్విటీ, అసెస్ మెంట్ అండ్ ట్రైనింగ్ ఎక్స్ లెన్స్ నిర్వహించిన మరొక అధ్యయనం ప్రకారం పూర్వ విద్యార్థులతో పరస్పర చర్యలు విద్యార్థుల జీవితాలపై విద్యాపరమైన ప్రభావాన్ని చూపించే అవకాశం ఉందని నిర్ధారించిందని వివరించారు.

# ముద్రగడ వల్ల వైసీపీకి మేలు జరిగిందా.. కీడు కలిగిందా..?

**అమరావతి మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** :ఏపీలో మునుపెన్నడూ లేనివిధంగా అన్నట్లుగా సాగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఇక ఫలితాలు తెలియాలంటే జూన్ 4 వరకూ వేచి చూడాలి. మరోపక్క గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో దాదాపు అందరికళ్లూ పిఠాపురంలో గెలుపు ఎవరిది అనే అంశంపై ఆసక్తిగా నెలకొన్నాయని అంటున్నారు. ఈ సమయంలో ముద్రగడ పద్మనాభానికి సంబంధించిన ఓ చర్చ తెరపైకి వచ్చింది. అవును... ఏపీలో టీడీపీ - జనసేన - బీజేపీ కూటమిగా కలిసి పోటీ చేసిన సంగతి తెలిసిందే. వాస్తవానికి ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్, ముస్లిం లు పూర్తిగా జగన్ వైపు ఉన్నారని.. బీసీలు, రెడ్లు సగం సగం మాత్రమే ఫ్యాన్ కు ఫేవర్ గా పనిచేశారని ఒక చర్చ నడిచింది. దీంతో కమ్మ కులస్థులు పూర్తిగా, బీసీలు సుమారుగా సగం మంది మాత్రమే కూటమికి అనుకూలంగా రియాక్ట్ అయ్యారనే మాటలూ వినిపించాయి. ఈ సమయంలో కాపుల ఓట్లు అత్యంత



కీలకంగా మారాయి. కాపుల్లో మెజారిటీ ఓటర్లు జనసేన వైపే ఉన్నారనే కామెంట్లు బలంగా వినిపించాయి. ఈ సమయంలో జనసేన కూటమిలో భాగం కావడంతో ఇక కాపుల ఓట్లపై అధికారపార్టీ ఆశలు వదిలేసుకోవడమే అనే చర్చా తెరపైకి వచ్చింది. ఈ సమయంలో... కాపు ఉద్యమ నేత ముద్రగడను జగన్ రంగంలోకి దించారు. దీంతో... ఆ సామాజికవర్గానికి చెందిన పలు మీటింగులకు ముద్రగడ ముఖ్య అతిథిగా హాజరై.. జగన్ కు అనుకూలంగా ప్రసంగించారు! వాస్తవానికి మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే... ముద్రగడకు అసలైన టాస్క్ పిఠాపురంలో పవన్ ఓటమికి కారణం అవ్వడం! అయితే... ఈ విషయంలో ముద్రగడ చేసిన కొన్ని "అతి" వ్యాఖ్యలు పవన్ కు అనుకూలంగా మారాయనే చర్చ ఎన్నికల వేళ బలంగా వినిపించింది. ఇందులో భాగంగా వృద్ధులు, మహిళలు కాస్త ముద్రగడ అభిప్రాయంతో ఏకీభవించినట్లు కనిపించినా... ప్రధానంగా యువత మాత్రం ముద్రగడ వ్యాఖ్యలను సీరియస్ గా తీసుకుంది. ఫలితంగా పవన్ వైపు మరింత గట్టిగా నిలబడిందని అంటున్నారు. ఈ క్రమంలోనే మొదట్లో ముద్రగడ వైపు ఆ సామాజికవర్గం కాస్త బలంగా నిలబడినా.. పోలింగ్ నాటికి పరిస్థితి భిన్నంగా మారిపోయిందని చెబుతున్నారు. అందువల్లే పోలింగ్ అనంతరం ముద్రగడ %ం% కో సైలెంట్ అయిపోయారనే కామెంట్లు వినిపిస్తుండటం గమనార్హం. మరి జగన్ ఆశించినట్లుగా నిజంగా ముద్రగడ వైసీపీకి బలంగా మారారా.. లేక, ఆయన ఎంట్రీ వల్ల అసలుకే ఎసరొచ్చిందా అనేది తెలియాలంటే జూన్ 4వరకూ వేచి చూడాల్సిందే!

# ఏపీలో కూటమి 130 సీట్లు పైగా సాధించబోతుంది



**విజయవాడ మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎన్డీయే కూటమి (మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్) మల్టీస్టార్ మహా కూటమి ఏపీలో సూపర్ డూపర్ హిట్ ఐయిందని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. ఏపీలో కూటమి 130 సీట్లు పైగా కూటమి సీట్లు సాధించబోతుంది 2019లో జగన్ ను గెలిపించేందుకు బారులు తీరిన ప్రజలు ఐదేళ్లు ఇబ్బందులు పడ్డారని ఆయన అన్నారు. బుధవారం బుద్దా వెంకన్న తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇలాంటోడినా గెలిపించింది అని ప్రజలు తెలుసుకుని ఈసారి ఓడించాలని కంకణం కట్టుకున్నారు ఈ ఎన్నికలలో జగన్ ను ఓడించాలని ప్రజలు వివిధ ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో తరలి వచ్చారు జగన్ పాలన తో విసిగిపోయిన ప్రజలు సాగనంపేలా కూటమికి ఓట్లు వేశారని బుద్దా ప్రకటించారు. జగన్ కు ఇచ్చిన అవకాశం దుర్వినియోగం చేసి ప్రజలను ఇబ్బందులు పెట్టారు 2019 లో 79శాతం పోలైతే నేడు 81 శాతం పోలింగ్ జరిగింది. జగన్ పై వ్యతిరేక ఓటు వేసేందుకు తెల్లవారు జాము నుంచే ఓటర్లు బారులు తీరారు. ఐదారు గంటలు ఆలస్యం అయినా.. ఓపికగా వేచి ఉండి జగన్ ను సాగనంపాలనే లక్ష్యంతో ఓట్లు వేశారని బుద్దా హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాలుగుసారి ముఖ్యమంత్రి కావడం ఖాయం అమరావతి వేదిక ఆయన ప్రమాణ స్వీకారం చేయడం తథ్యం అమరావతి ని అభివృద్ధి చేస్తామన్న జగన్ రాజధాని లేకుండా సర్వనాశనం చేశారుఇప్పుడు అదే అమరావతి లో నాలుగోసారి చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తారని ధీమా వ్యక్తంచేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఒక రికార్డు అన్నారు. వైసీపీ గెలుస్తుంది, జగన్ విశాఖలో ప్రమాణ స్వీకారం చేస్తారని బొత్స, సజ్జల ప్రకటించారు కేవలం అధికారులను భయపట్టేందుకు ఈ ప్రచారం చేస్తున్నారన్నారు. ఐదేళ్లల్లో అవకతవకలకు పాల్పడిన వారు ఫైళు కూడా మాయం చేసేలా కుట్రలు చేస్తున్నారు చంద్రబాబు, పవన్ , మోడీ సారథ్యంలో ఏపీ అభివృద్ధి అవుతుందని ప్రజలు ఓట్లు వేశారుచంద్రబాబు వంటి నాయకుడిని అన్యాయంగా జైల్లో పెట్టారని కక్షతో ప్రజలు జగన్ కు ఓడించాలని ఓట్లు వేశారు సైకిల్ పై పడిన ప్రతి ఓటు చంద్రబాబును చూసి ప్రజలు వేశారన్నారు. అభ్యర్దులను చూసి కాదు... చంద్రబాబు మళ్లీ రావాలని ఓట్లు వేశారురాక్షస పాలన అంతం చేసేందుకు భువనేశ్వరి, బ్రాహ్మణి కూడా ప్రజల్లోకి వచ్చారు జగన్ కు 151 సీట్లు వచ్చినప్పుడు టీడీపీ పని అయిపోందన్నారు. కానీ చంద్రబాబు పట్టుదలతో రాష్ట్రం, ప్రజల కోసం నిలబడ్డారు నేడు మళ్లీ ప్రజలు ఆశీర్వాదంతో అధికారంల అందుకుంటున్నారు నారా కుటుంబంలో ఉన్న నలుగురు చంద్రబాబు, లోకేష్, భువనేశ్వరి, బ్రాహ్మణి నాలుగు దిక్కులుగా మారి ప్రచారం చేశారు. చంద్రబాబు ను జైలుకు పంపిన ఘటనతో రాష్ట్ర ప్రజలు మొత్తం బాధ పడ్డారు పవన్ కళ్యాణ్ కూడా అక్రమ అరెస్టుపై స్పందించి చంద్రబాబుకు మద్దతు ఇచ్చారని ఓటర్లు కి కృతజ్ఞతలు తెలిపారు. ఒక దొంగను తరిమి కొట్టేందుకు నిజాయతీ పరులు అందరూ ఒకటయ్యారుభేషరతుగా మద్దతు పలికి వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వకుండా పాత్ర పోషించిన పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలన్నారు. ఓటమి విషయం తెలిసి కూడా బొత్స సత్యనారాయణ మేకపోతు గాంభీర్యం పోతున్నారు. బొత్స సతీమణి ఝాన్సీ కూడా అక్కడ ఓడిపోతున్నారనేది వాస్తవం. కేవలం కొన్ని ఫైళ్లు పనులు చేసుకునేందుకు బొత్స ఇలా మాట్లాడుతున్నారు. ఝాన్సీ గెలుస్తారని చెప్పి సవాల్ చేసే ధైర్యం బొత్సకు ఉందా.. అంటూ ప్రశ్నించారు. జగన్ అరాచక పాలనతో పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు తారు మారు అయ్యాయియేడాదికి జగన్ ఇచ్చి 15 లేదా 20 వేలతో కుటుంబాలు గడిచిపోతాయా పేదలు సంపాదించుకోకుండా.. తాను ఇచ్చే తాయిలాలు కోసం ఎదురుచూడాలని జగన్ భావించాడు. సమాజంలో ఇంకా మానవత్వం ఉందంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వంటి వ్యక్తులే కారణం మహా కూటమి 130కి పైగా సీట్లు వస్తాయి.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారు. కోటికొక్కడు అనే పదానికి అక్షర సత్యం నారా చంద్రబాబునాయుడు అటువంటి వ్యక్తి పాలనలో ప్రజలకు, రాష్ట్రానికి మంచి జరుగుతుంది. ప్రజలతో పాటు, ఉద్యోగస్తులు కూడా మహా కూటమికే ఓట్లు వేశారు. జగన్ ఎవరినీ వదలకుండా ఇబ్బందులు పెట్టారు. అందుకే సమయం చూశారు.. సాగనంపుతున్నారని బుద్దా అన్నారు. జగన్ ఓడించడానికే ఇతర రాష్ట్రాలు, దేశాల్లో స్థిరపడిన తెలుగు వారంతా తరలి వచ్చారు మన రాష్ట్రం, మన ప్రాంతం అభివృద్ధి చెందాలనే ఆరాటంతో వారంతా ఏపీకి తరలి వచ్చారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సుజనా చౌదరి 40వేల ఓట్లతో గెలుస్తున్నారు. జూన్ 4న వెలువడే ఫలితాలు చూశాక మరింత ఆశ్చర్యపోతారన్నారు.

# నాణ్యతా ప్రమాణాలపై అవగాహన పెరగాలి

- ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య జోన్ 1 ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ బి విజయ్ భాస్కర్
- విజ్ఞానశాస్త్రాన్ని ప్రమాణాల ద్వారా నేర్చుకోవడం"పై ఉపాధ్యాయులకు అవగాహనా సదస్సు

**విజయవాడ మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ మిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ నాణ్యమైన వస్తువులు గుర్తించి వినియోగించుకోవడంపై అవగాహన సదస్సు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారి ఆధ్వర్యంలో "విజ్ఞానశాస్త్రాన్ని ప్రమాణాల ద్వారా నేర్చుకోవడం"పై ఉపాధ్యాయులకు హోటల్ పామ్ బీచ్ లో బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ దేశంలోని నేషనల్ స్టాండర్డ్స్ బాడీగా దేశంలో నాణ్యమైన పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి అనేక విధులు, సేవలను అందిస్తుంది. బి 15 యొక్క కార్యకలాపాలలో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాల సూత్రీకరణ,





అనుగుణ్యత అంచనా పథకాలు (ఉత్పత్తి ధృవీకరణ, సిస్టమ్స్ సర్టిఫికేషన్, రిజిస్ట్రేషన్ మరియు హాల్‌మార్కింగ్) పరీక్ష ,శిక్షణ ఉన్నాయి. ఈ కార్యకలాపాలన్నీ వారి ప్రధాన కార్యాలయాలు, ప్రాంతీయ శాఖ కార్యాలయాలు, దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న ప్రయోగశాలల ద్వారా నిర్వహించబడతాయి. బిఐఎస్ విజయవాడ 277 ప్రభుత్వ పాఠశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్‌ను స్థాపించింది. యువతలో ప్రమాణాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి బిఐఎస్ ఏపీ స్టాండర్డ్స్ క్లబ్‌ల కళాశాలలు రూపొందించబడ్డాయి. స్టాండర్డ్స్ క్లబ్ కార్యాచరణలో భాగంగా బిఐఎస్ సాధారణంగా ఉపయోగించే రోజువారీ ఉత్పత్తుల ద్వారా ప్రదర్శించబడే శాస్త్రీయ చట్టాలు, సూత్రాల యొక్క ఆచరణాత్మక అనువర్తనాలపై దృష్టి సారించి లెసన్ ప్లాన్‌లను అభివృద్ధి చేస్తోంది. ఈ ప్రెజెంటేషన్‌ల స్వభావం కారణంగా, లెసన్ ప్లాన్‌లు మీ పాఠశాల విద్యార్థులకు సాధారణ కోర్సు పాఠ్యాంశాల్లో భాగంగా బోధించే సైన్స్ సబ్జెక్టుల పరిజ్ఞానాన్ని భర్తీ చేయడానికి ఉపయోగపడతాయి. "లెర్నింగ్ సైన్స్ వయా స్టాండర్డ్స్" బిఐఎస్ యొక్క చొరవ. ఇది నాణ్యత , ప్రమాణాల భావనల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ జ్ఞానం, అవగాహనను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇకమీదట, మన దేశం నాణ్యమైన స్పృహను పెంపొందించడానికి విశాఖపట్నంలో అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన బిఐఎస్ స్టాండర్డ్స్ క్లబ్‌లను కలిగి ఉన్న పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 60 మంది ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొని ప్రయోజనం పొందారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు తెలిసిన సైన్స్ కాన్సెప్ట్‌ల పరిజ్ఞానం ద్వారా వారు రోజువారీ జీవితంలో ఉపయోగించే వివిధ ఉత్పత్తుల యొక్క భారతీయ ప్రమాణాలను బోధించడానికి ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చింది. విద్యార్థులు తాము నేర్చుకునే సైన్స్ కాన్సెప్ట్‌లకు ప్రమాణాలు ఎలా సంబంధం కలిగి ఉన్నాయో అర్థం చేసుకోవడానికి ఈ కార్యాచరణ సహాయపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య జోన్ 1 ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ బి విజయ్ భాస్కర్ ఆంధ్రప్రదేశ్ బిఐఎస్‌ను ప్రశంసించారు. విద్యార్థుల ద్వారా సమాజంలో నాణ్యమైన స్పృహను పెంపొందించే దిశగా స్టాండర్డ్స్ క్లబ్ కార్యకలాపాలను నిర్వహించడంలో చురుగ్గా పాల్గొనేలా స్టాండర్డ్స్ క్లబ్ మెంటార్‌లు, సైన్స్ ఉపాధ్యాయులను ప్రోత్సహించారన్నారు. డి వివేక్ వర్ధన్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్. బిఐఎస్ యొక్క ప్రధాన కార్యకలాపాలు, స్టాండర్డైజేషన్, స్టాండర్డ్స్ మార్క్స్, బిఐఎస్ కేర్ యాప్ మొదలైన వాటి గురించి వివరించారు. సైన్స్ టీచర్‌లకు బిఐఎస్ అభివృద్ధి చేసిన వివిధ ఉత్పత్తుల లావాదేవీల పాఠ్య ప్రణాళికలపై ప్రదర్శించబడిందన్నారు. భావనారాయణ సెక్షన్ ఆఫీసర్ చివరిగా ఐ ఎస్ ఐ మార్క్ చేయబడిన వస్తువులు, హాల్‌మార్క్ చేయబడిన బంగారు ఆభరణాల ధృవీకరణ కోసం బిఐఎస్ కేర్ యాప్‌ని తప్పనిసరిగా అందరూ ఉపయోగించాలని కోరారు.

# కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటాను

## మైలవరం నియోజకవర్గం కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్



**ఇబ్రహీంపట్నం మే 15(వార్తా ప్రభ ప్రతినిధి):-** మైలవరం నియోజకవర్గంలో ఎన్నికల్లో తనకోసం కష్టపడ్డా ఈ కార్యకర్తకు రుణపడి ఉంటానని తెలిపారు మైలవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్. బుధవారం నాడు నియోజకవర్గ పరిధిలోని ఇబ్రహీంపట్నం మండలం లో దొనబండ నుంచి మెదలై చిలుకూరు, దాములూరు, కోటికలపూడి, కేతనకోండ మూలపాడు, జూపూడి, తమ్మలపాలెం, గుంటుపల్లి, ఈలప్రోలు, గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నాయకులు మరియు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా కోసం మీరు ఎంతో కష్టపడ్డారు.

**మీరు నాపై చూపుతున్న అప్యాయత మరవలేను.** మైలవరం నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు. తన కోసం కష్టపడిన తెలుగుదేశం జనసేన బిజెపి కుటుంబ సభ్యులందరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ సరళిని గ్రామాల్లో పరిస్థితులు పోలింగ్ శాతం తదితర అంశాలపై స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి సీనియర్ నాయకుడు కెవిఎన్ఆర్ జన్మదిన వేడుకలు



**విస్సన్నపేట మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వైభవ్ జ్యుయలరీ అధినేత కుక్కడపు వెంకట నాగేశ్వరరావు( కెవిఎన్ఆర్) జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వక కార్యదర్శి నెక్కలపు శ్రీనివాసరావు దాబా శ్రీను శీను ఆధ్వర్యంలో కేకు కట్ చేసి అందరికి పంపిణీ చేశారు . అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి పార్టీ గెలుపుకు కృషి చేసిన వారిలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మన నాగేశ్వరరావు ముఖ్యపాత్ర పోషించారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలం మహిళా అధ్యక్షురాలు సంబారు నాగలక్ష్మి ,మండల టిడిపి ఉపాధ్యక్షులు వడ్లమూడి చంటి, ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి నాదెళ్ల నాగమణి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పలగాని మాధవరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల రాధాకృష్ణ, కిలారి అప్పారావు, విశ్రాంత టెలికాం ఉద్యోగి గోపాల్, ముస్లిం నాయకులు సుభాని, సులేమాన్, కేజీ స్వామి భూషణం ఎన్ మహేంద్ర, ఫణీంద్ర ,నవీన్ బువ్వ అమర ప్రసాద్ (పండు బాబు) బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా కమలాకర్కమలాకర్, మురుగుల ప్రసాద్ సూపర్ బజార్ రామకృష్ణ వర్రీ వెంకటేశ్వరరావు బద్రీనాథ్ ఎం ప్రభాకర్ పలగాని వెంకటేశ్వరరావు దునకా సత్యనారాయణ హైవే టైలర్స్ శ్రీను పర్వతం రామకృష్ణ జి నరేంద్ర కుమార్ వార్డు నెంబర్ ఒకటి వెంకట్రావు నెక్కలపు సురేష్ సానం రాము షాకీరు ఖాదర్ భాష తదితరులు తమ విషెస్ తెలియజేశారు.

# బస్సుప్రమాద ఘటనపై హెూం మంత్రి తానేటి వనిత దిగ్భ్రాంతి



**విజయవాడ, మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**: పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద బస్సు ప్రమాదంలో ఆరుగురు మరణించిన ఘటనపై హెూంమంత్రి తానేటి వనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు హెూంమంత్రి ప్రగాడ సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ మేరకు యర్నగూడెంలోని హెూం మంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. చిలకలూరి పేట సమీపంలోని పసుమర్రు వద్ద హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు %-% టిప్పర్ లారీ ఢీకొట్టడంతో మృతి చెందారన్న వార్త తెలియగానేహొతన మనసును కలిచి వేసిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గ్రామాలలో పరిశుద్ధ్య లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**బోధన్ మే 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**. గ్రామాలలో పారిశుద్ధ్య లోపాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ గ్రామ స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం రెంజల్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామల కార్యదర్శిలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. తాగునీరు, పంచాయితీ చెల్లించవలసినటువంటి ఈఎంఐ చెల్లింపులను సకాలంలో చేయాలని తెలిపారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఆయా గ్రామ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

# సమిష్టి కృషి తో విజయం సాధ్యం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి





**విజయవాడ సెంట్రల్,మే 15 (వార్తాప్రభ) :** కార్యకర్తల ఆధారిత పార్టీ బిజెపి మాత్రమే నని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. పార్టీ పటిష్టత లో విస్తారక్ ల పాత్ర ప్రశంసనీయం అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయం లో విస్తారక్ ల సమీక్షా సమావేశం లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఎన్నికల పని యోజన లో విస్తారక్ లు పార్టీ కి అందించిన సేవలు మరువలేనివని, విస్తారక్ ల ను వ్యక్తి గతంగా అభినందించారు. విస్తారక్ రాష్ట్ర ప్రముక్ ఉన్ని కృష్ణన్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్య నారాయణ రాజు, బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ తదితరులు సమావేశంలో మాట్లాడారు.

# పిల్లి దంపతులను కలిపిన పంతం నానాజీ




**కాకినాడ రూరల్,మే 15 (వార్తాప్రభ) :** మాజీ ఎమ్మెల్యే తెలుగు దేశం పార్టీ నియోజక వర్గ కో -ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి అనంత లక్ష్మి దంపతులను కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల్లో తమకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఓటింగ్ సరళి, విజయావకాశాలులపై చర్చించారు.

# పల్నాడులో అప్రకటిత కర్ఫ్యూ .... 144 సెక్షన అమలు



**నరసరావుపేట, మే 15 (వార్తాప్రభ) :** పోలింగ్ సందర్భంగా పల్నాడు జిల్లాలో చెలరేగిన హింసాత్మక సంఘటనలు రెండోరోజూ కొనసాగడంతో ఈసీ 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా పాలనాధికారి శివశంకర్ పోలీసు శాఖకు ఉత్తర్వులిచ్చారు. నరసరావుపేట లోక్‌సభ స్థానంతో పాటు నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, పెదకూరపాడు, గురజాల, మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత రాత్రి నుంచి తదుపరి ఆదేశాలు జారీచేసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ముగ్గురికి మించి ఎక్కువ మంది గుమికూడొద్దని, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, అనుమానాస్పదంగా సంచరించకూడదని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఇది ఇలా ఉంటే అల్లర్లు జరుగుతాయన్న ప్రచార నేపధ్యంలో పల్నాడు జిల్లా మాచర్లకు వచ్చే అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు పోలీసులు. అనుమానస్పదంగా ఉంటే వారిని అదుపులోకి పోలీసులు తీసుకుంటున్నారు. అల్లర్లు, హింసాత్మక ఘటనలకు పాల్పడితే ఎవరైనాసరే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. ఇక గత రాత్రి నుంచి పల్నాడు జిల్లా మాచర్లలోనే ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి మకాం వేశారు. పల్నాడు ఎస్పితో పాటు ఇతర సీనియర్ పోలీసు అధికారుల నేతృత్వంలో, ఏకంగా 2300 మంది సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చూస్తున్నారు. మ-రోవైపు పలనాడులో అనేక ప్రాంతాల్లో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తున్నది.. దీంతో షాపులు తీసేందుకు వ్యాపార వర్గాలు విముఖత చూపిస్తున్నారు. నిన్న రాత్రి నుండి దుకాణాలు పలు వ్యాపార వర్గాలు మూసేసాయి. కాగా వైసిపి నేతలు కాసు మహేష్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ , పిన్నెల్లి తదితరులు ఉంటున్న నివాసాల వద్ద భారీ గా పోలీసులు మోహరించారు..

# కాంగ్రెస్, బిఆర్ఎస్ లకు షాకే....
# జూన్ నాలుగున దిమ్మతిరుగుడు ఖాయం




**కరీంనగర్,మే 15 (వార్తాప్రభ) :** ముస్లింలంతా ఏకమై బండి సంజయ్ ని ఓడించాలని కేసీఆర్ పిలుపునిస్తే హిందువులంతా ఏకమై బండి సంజయ్ ని గెలిపించబోతున్నారని అన్నారు బిజెపి అభ్యర్థి బండి. హిందువులు ఏకమైతే ఎలాంటి ఫలితాలు వస్తాయో జూన్ 4వ తేదీన కరీంనగర్ పార్లమెట్ నియోజకవర్గం పరిధిలో చూపించబోతున్నారన్నారు. ఈ మేరకు ఆయన ట్విట్ చేశారు.. జూన్ 4న రాబోయే ఫలితాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెంపపెట్టు తప్పదని అన్నారు. కేసీఆర్ లాంటి వ్యక్తుల కుటిల పన్నాగాలకు హిందువులంతా ఐక్యత చూపించారన్నారన్నారు. ఆ షాక్ ను చూసి కేసీఆర్ తట్టుకునేందుకు పక్కన సిద్ధంగా డాక్టర్లను పెట్టుకోవాలన్నారు. కేసీఆర్ వందేళ్లు బతకాలని కోరుకునే వ్యక్తులం తామని.. ఇకనైనా ఓ వర్గానికి కొమ్ము కాస్తూ హిందువులను రాచిరంపాన పెట్టవద్దన్నారు. తన గెలుపు కోసం అన్ని వర్గాల ప్రజలు పని చేశారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మరోసారి కేంద్రంలో నరేంద్ర మోడీ సర్కార్ ఏర్పడాలనే సంకల్పంతో అలుపెరుగని కృషి చేసిన బీజేపీ కార్యకర్తలు, స్థానిక నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# ఏపీ ఈఏపీసెట్ ఎంట్రన్స్ పరీక్షల సమర్థ నిర్వహణకు సర్వం సిద్ధం

● నేటి నుండి (16.05.2024) 23 వరకు ఈఏపీసెట్-2024 ఎంట్రన్స్ పరీక్షల నిర్వహణ ● నిమిషం ఆలస్యమైనా అనుమతించరు ● 49 రీజనల్ సెంటర్స్ లో 142 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు ● హైదరాబాద్ లో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు ● నంద్యాలలో 2 పరీక్ష కేంద్రాలు మార్పు ● పరీక్ష హాల్ లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు నిషిద్ధం ● ఈ ఏడాది రికార్డు స్థాయిలో 3,61,640 మంది దరఖాస్తు ● దరఖాస్తు చేసుకున్న వారిలో బాలురు 1,80,104, బాలికలు 1,81,536 మంది ● ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13 నుండి నిర్వహించాల్సిన ఎంట్రన్స్ పరీక్షలు ఈ నెల 16 నుండి 23 వరకు నిర్వహణ ● ఉదయం 9- 12, మధ్యాహ్నం 2.30 - 5.30 వరకు రెండు సెషన్స్ లో పరీక్షల నిర్వహణ ● ప్రొఫెసర్ కె. హేమచంద్రా రెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్



**విజయవాడ,మే 15 (వార్తాప్రభ) :** ఏపీ ఈఏపీసెట్-2024 ఎంట్రన్స్ నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రా రెడ్డి అన్నారు. బుధవారం మంగళగిరిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఏపీ ఈఏపీసెట్-2024 కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె. హేమచంద్రా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 49 రిజనల్ సెంటర్ల పరిధిలో ఎంపిక చేసిన 142 సెంటర్లలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2024(ఈఏపీసెట్) పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 3,61,640 (బాలురు 1,80,104-బాలికలు1,81,536)మంది అభ్యర్థులు ఏపీ ఈఏపీసెట్-2024 కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది 22,901 మంది ఎంట్రన్స్ పరీక్షకు అధికంగా దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. విద్యార్థుల సౌలభ్యం కోసం తెలంగాణా రాష్ట్రంలోని హైదరాబాద్ లో కూడా రెండు సెంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13నుండి నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్షలు ఈ నెల 16 నుండి 23 వరకు రోజుకు రెండు సెషన్స్ లో ఎంట్రన్స్ పరీక్షలు ఆన్ లైన్ బేస్డ్ (కంప్యూటర్ ద్వారా) పద్ధతిలో నిర్వహిస్తున్నామన్నారు. బైపీసీ విద్యార్థులకు ఈ నెల 16,17 తేదీల్లో 4 సెషన్స్ లో, ఎంపీసీ విద్యార్థులకు ఈ నెల 18 నుండి 23 వరకు 9 సెషన్స్ లో నిర్వహిస్తున్నామని వివరించారు. రోజుకు రెండు సెషన్స్ లో నిర్వహించే పరీక్షల్లో భాగంగా ఉదయం 9 నుండి 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుండి 5.30 గంటల వరకు రెండో సెషన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. గతేడాది మధ్యాహ్నం సెషన్ 3 నుండి 6 గంటల వరకు ఉండేదని ఈ ఏడాది అరగంట ముందుగా అనగా మధ్యాహ్నం 2.30 గంటల నుండి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంట్రన్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా తమ హాల్ టికెట్, ఒక గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి హాల్ టికెట్ వెనుక భాగంలో సెంటర్ రూట్ మ్యాప్ ను ముద్రించడం కూడా జరిగిందన్నారు.

**నిమిషం ఆలస్యమైనా అనుమతించం :** ఏపీ ఈఏపీసెట్ -2024 ఎంట్రన్స్ పరీక్షకు నిమిషం ఆలస్యమైనా అనుమతించమని, విద్యార్థులు ఈ విషయం గమనించాలని కోరారు. కావున పరీక్షా కేంద్రం వద్దకు అభ్యర్థులు కనీసం గంట ముందు చేరుకోవాలని సూచించారు. పరీక్షా హాల్ లోకి సెల్ ఫోన్, బ్లూ టూత్, కాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎంట్రన్స్ పరీక్షల నిర్వహణకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఇప్పటికే మాట్లాడటం జరిగిందని, అలాగే ఆర్టీసీ అధికారులతో చర్చించి సెంటర్ల వద్దకు బస్సులు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అంతే కాకుండా ప్రతి కేంద్రం వద్ద ప్రాథమిక వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచాలని అన్ని జిల్లాల డిఎంహెచ్వోలకు ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ అంతరాయం జరగకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడామన్నారు. ఒకవేళ విద్యుత్ అంతరాయం జరిగితే జనరేటర్ లు అందుబాటులో ఉంచామన్నారు.

**నంద్యాల లో రెండు సెంటర్ల మార్పు :** నంద్యాల పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసకున్న విద్యార్థులు తమకు కేటాయించిన సెంటర్ల మార్పును గమనించాలని కె. హేమచంద్రారెడ్డి కోరారు. ఎన్నికల ఈవీఎంల స్ట్రాంగ్ రూంలుగా ఆర్జీఎంఐటీ, శాంతారామ్ ఇంజనీరింగ్ కాలేజీలను నంద్యాల కలెక్టర్ గుర్తించటం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా సెంటర్ అభ్యర్థుల కోసం శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజీ, శ్రీ రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, ఎస్ వి ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ (3 సెంటర్లను) కొత్తగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంబంధిత సెంటర్ అభ్యర్థులు ఈ విషయాన్ని గుర్తించాలని, తమ వంతుగా ఆయా సెంటర్ల మార్పు పై ఈమెయిల్, ఫోన్, ఎస్ ఎం ఎస్ ల ద్వారా సమాచారం అందించామన్నారు. నంద్యాల లో సెంటర్లు ఎంచుకున్న అభ్యర్థులు మరోసారి తమ హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. సందేహాల నివృత్తికి హెల్ప్ లైన్ (08842359599, 08842342499) ఏర్పాటు చేశామని హేమచంద్రా రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో జెఎన్టియుకే వైస్ ఛాన్సలర్ ప్రొ. జివిఆర్ ప్రసాద రాజు, ఏపీఎస్‌సిహెచ్ఈ వైస్ ఛైర్మన్ కె. రామ మోహన రావు, ఏపీఎస్‌సిహెచ్ఈ వైస్ ఛైర్ పర్సన్ పి. ఉమామహేశ్వరీదేవి, ఏపీఎస్‌సిహెచ్ఈ సెక్రటరీ వై. నజీర్ అహ్మద్, ఏపీఎస్‌సిహెచ్ఈ ప్రత్యేక అధికారి ఎం. సుధీర్ రెడ్డి, ఏపీఎస్‌సిహెచ్ఈ అసిస్టెంట్ ప్రత్యేక అధికారి జి. మాధవి, ఏపీఎస్‌సిహెచ్ఈ అకడమిక్ అధికారి ఎస్. చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఎన్ఆర్ఐల కృషి అనన్యసామాన్యం

● సప్తసముద్రాలు దాటొచ్చి పోలింగ్‌లో పాల్గొన్న వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు ● ఎన్ఆర్ఐ టీడీపీ నేతలకు చంద్రబాబు కితాబు ● పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ఎన్ఆర్ఐ గ్రాట్యుటీ డిన్నర్ కార్యక్రమం ● జూమ్ కాల్ ద్వారా పాల్గొని ఎన్ఆర్ఐల సేవలను కొనియాడిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు





**గుంటూరు,మే 15 (వార్తాప్రభ) :** ఏపీలో మే 13వ తేదిన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రవాసాంధ్రులు ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి పోలింగ్ ప్రక్రియలో భాగస్వామ్యంకావడం అనన్యసామాన్యమని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. మేము సైతం అంటూ వివిధ దేశాల్లో స్థిరపడ్డ ఎన్ఆర్ఐలు ఏపీకి చేరుకుని దాదాపు నెల రోజులుగా ఎన్డీయే కూటమి గెలుపు కోసం పనిచేయడం అద్వితీయమని, వారి సేవలు మరవలేనివని కొనియాడారు. మంగళవారం సాయంత్రం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ వేమూరి రవి, గల్ఫ్ టీడీపీ అధ్యక్షుడు రావి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఆర్ఐ గ్రాట్యుటీ డిన్నర్ కార్యక్రమంలో అధినేత చంద్రబాబునాయుడు జూమ్‌కాల్ ద్వారా పాల్గొని ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఎన్డీయే కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పలువురు ఎన్ఆర్ఐలు ఆసక్తి చూపించారు. వెంకట్ కోడూరి, మాలేపాటి సురేష్ తదితరులు ఎన్నికల వేళ తాము నిర్వహించిన విధులు, పోలింగ్ సరళిని చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా అధినేత చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఓటుహక్కు అనేది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని, అలా ఏపీలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం కోసం దేశవిదేశాల్లోని ఎన్ఆర్ఐలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక పాలసీ తీసుకొచ్చి ఎన్ఆర్ఐల సమస్యల కోసం పనిచేస్తామన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఐల సంక్షేమంపై దృష్టిపెట్టకపోవడంతో వారిద్వారా రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలు రాకుండా ఆగిపోయాయని, గల్ఫ్ దేశాల్లోని ఎన్ఆర్ఐలు ప్రమాదం బారినపడితే రూ.లక్ష, ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.10 లక్షలు, అక్కడ వారికి ఏదైనా న్యాయ సమస్యలు తలెత్తితే రూ.50 వేల వరకు అందేలా నాడు టీడీపీ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని చంద్రబాబు గుర్తు చేశారు. ఏపీ ఎన్ఆర్టీ విభాగం కింద టీడీపీ హయాంలో ఇమ్మిగ్రేషన్, ఇతర సమస్యలతో ఇబ్బంది పడేవారిని స్వదేశాలకు తరలించడంతోపాటు దుబాయ్ తదితర గల్ఫ్ దేశాల్లో ఉద్యోగ, ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పించడం కోసం తమ ప్రభుత్వం రెండు శిక్షణ కేంద్రాలు నిర్వహించిందన్నారు. మన రాష్ట్రం నుంచి ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వారికి మంచి వేతనం లభించేలా, వారికి శిక్షణ అందించేలా సదరు కేంద్రాలను నడపడం జరిగిందన్నారు. నాడు టీడీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఐల కోసం చేపట్టిన కార్యక్రమాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్ఆర్ఐల సంక్షేమం కోసం కృషి చేస్తామని, నేరుగా తనను కలిసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏపీ భవిష్యత్తు కోసమే తాము కుటుంబ సభ్యులతో సహా స్వచ్ఛందంగా ఏపీకి తరలివచ్చి ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నామని, స్వయంగా ఓటు వేయడం సంతోషంగా ఉందని పలువురు ఎన్ఆర్ఐలు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, కూటమి గెలుపు ఏపీకి మలుపు కాబోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యాలయ కార్యనిర్వహక కార్యదర్శి పి.అశోక్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బుచ్చిరాం ప్రసాద్, గన్నవరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, పెనమలూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోడె ప్రసాద్, గుంటూరు మిర్చియార్డ్ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ మహిళా చైరపర్సన్ నన్నపనేని రాజకుమారి, అమెరికా ఎన్ఆర్ఐ టీడీపీ కోఆర్డినేటర్ కోమటి జయరామ్, అరవింద్ వేమూరు, చప్పిడి రాజశేఖర్ లతో పాటు సుమారు 500 మంది ఎన్ఆర్ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరి వివర్స్ సోసైటీ బలోపేతం చేసేందుకు వారి అమ్మకాలను ప్రోత్సహించేలా టీడీపీ కేంద్ర కార్యాలయంలో పనిచేసే హౌస్ కీపింగ్, ఆఫీస్ బాయ్స్, సెక్యూరిటీ సిబ్బందికి రూ. 2 వేలు విలువ చేసే గిఫ్ట్ చెక్స్ ను ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులు అందజేశారు.


# ఏపీలో హింసాత్మక ఘటనలపై ఈసీ ఆగ్రహం.. సీఎస్, డీజీపీకి సమన్లు

● పల్నాడు, చంద్రగిరి సహా పలు హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది.




**అమరావతి, మే 15 (వార్తాప్రభ) :** పల్నాడు, చంద్రగిరి సహా పలు హింసాత్మక ఘటనలపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల్లోనూ అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి వివరణ ఇవ్వాల్సిందిగా ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాలను ఆదేశించింది. ఈ ఘటనలపై వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా ఈసీ సమన్లు పంపింది. హింసాత్మక ఘటనలు జరుగుతాయని ముందే హెచ్చరికలు ఉన్నా .. పోలింగ్ రోజు అంత నిర్లిప్తంగా ఎందుకు వ్యవహరించారని ఈసీ ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. ఈమేరకు ఇద్దరు అధికారులు గురువారం ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎన్నికల కమిషన్ ముందు హాజరై వివరణ ఇవ్వనున్నారు. ఎన్నికలతో పాటు అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపట్ల స్థానిక అధికారులు నిర్లిప్తంగా, నిర్లక్ష్యంగా వదిలేసినట్టు ఈసీ గుర్తించింది. పల్నాడులో స్వయంగా పర్యటించిన ఏపీ ప్రత్యేక అబ్జర్వర్ రామ్మోహన్ మిశ్రా ఈ అంశాలను నేరుగా సీఈసీకి నివేదించినట్టు తెలుస్తోంది.

# బస్సు డ్రైవర్ ఓవర్ స్పీడ్ వల్లే ప్రమాదం : పోలీసుల విచారణలో కీలక విషయాలు



**చిలకలూరిపేట (బాపట్ల) , మే 15 (వార్తాప్రభ) :** పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఓటు వేసి తిరిగి వస్తుండగా బస్సును టిప్పర్ ఢీకొట్టడంతో ఆరుగురు సజీవదహనం అయ్యారు. ఈ ఘోర ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. బస్సు డ్రైవర్ ఓవర్ స్పీడు వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ అంజి మృతి చెందారు. బాపట్ల జిల్లా చిన్నాగంజం నుంచి హైదరాబాదుకు బయలుదేరిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు, చిలకలూరిపేట మండలం పూరివారిపాలెం డొంక సమీపంలో ఒక టిప్పర్ ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బస్సు-టిప్పర్ ఢీకొట్టుకోవడంతో అక్కడికక్కడే మంటలు వ్యాపించి రెండు వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 42 మంది ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుల్లో టిప్పర్ డ్రైవర్, ట్రావెల్ బస్ డ్రైవర్ తో పాటు మరో నలుగురు బస్సులోని ప్రయాణికులు సజీవదహనం అయ్యారు.

**బస్సు డ్రైవర్ ఓవర్ స్పీడుతో నడిపారు : ప్రత్యక్ష సాక్షులు**

బస్సు బయలుదేరినప్పటి నుంచి ప్రయాణికుల్లో ఆందోళన నెలకొందని ప్రత్యక్ష సాక్షులు తెలియజేశారు. బస్ డ్రైవర్ ఫుల్ స్పీడుతో నడిపారని పోలీసులకు సమాచారం. చినగంజాం నుంచి బయలుదేరినప్పటి నుంచి బస్సును డ్రైవర్ అంజి ఓవర్ స్పీడ్ గా నడిపినట్లు చెప్పుకొచ్చారు. ఫాస్టుగా వెళ్లొద్దని పలువురు ప్రయాణికులు నివారించినట్లు తెలిపారు. బస్సెక్కిన గంటప్పావులో ఆరు నిండు ప్రాణాలు బుగ్గిపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ మరో మృతుని ఆచూకి తెలియలేదు. బస్ డ్రైవర్ సీటు వెనుకున్న బెర్తులో పడుకున్న వ్యక్తి చనిపోయినట్టు పోలీసులు అంచనా వేస్తున్నారు. ఇక, బస్సు ప్రమాదంతో బస్ క్లీనర్ బెంబేలెత్తి పారిపోయినట్లు తెలుస్తుంది. బస్ క్లీనర్ ఆచూకీపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి గురైన లక్ష్మీ ప్రసన్న ట్రావెల్స్ బస్ చీరాలకు చెందినదిగా గుర్తించారు. ప్రమాదంలో చనిపోయిన ఓనర్ కమ్ డ్రైవర్ అంజీ.. ప్రమాద సమయంలో డ్రైవర్ల కండీషన్లపై పోలీసుల ఎంక్వైరీ చేస్తున్నారు. అయి-తే, చిలకలూరి పేట బస్సు ప్రమాదంలో గాయపడిన వారిలో ఏడుగురికి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఐదుగురికి చికిత్స చేసిన తరువాత వైద్యులు పంపేశారు. మరో ఇద్దరు క్షతగాత్రులకి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.







చాట్రాయి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం,జనసేన,బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్ధసారథి

-నూజివీడు,మే 15 (వార్తాప్రభ) :

# వాసవీ వనితా విదర్భపురి మజ్జిగ పంపిణీ



**గుడివాడ,మే 15 (వార్తాప్రభ) :** మండు టెండలను దృష్టిలో ఉంచుకుని వాసవీ వనితా క్లబ్ విదర్భపురి ఆధ్వర్యాన గత నెల రోజుల పైగా నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ అభినందనీయమని వాసవీ క్లబ్ జిల్లా కోశాధికారి చిట్టూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. క్లబ్ ఏర్పాటు చేసిన మజ్జిగ శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా నాయకులు గాదే మోహన్‌బాబు, క్లబ్ అధ్యక్షురాలు చీదెళ్ళ లక్ష్మీ, కార్యదర్శి చలువాది సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షికి బి.సీ. సంఘం నివాళి



**గుడివాడ,మే 15 (వార్తాప్రభ) :** గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గ బిసి సంఘం ఆధ్వర్యాన స్థానిక శ్రీరాంపురం లోని కార్యాలయంలో బుధవారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రావులకొల్లు మల్లేశ్వరరావు మాట్లాడుతూ అసాధ్యమైన పనులను సుసాధ్యం చేసిన ఘనత భగీరథ మహిర్షకే చెందుతుందని తెలిపారు. గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం బిసి సంఘం అధ్యక్షులు అగస్తి ఆది విష్ణు మాట్లాడుతూ దివినుండి భూమికి గంగా జలాన్ని తీసుకువచ్చి లోకానికి అందించిన మహనీయుడని కొనియాడారు. భవిష్యత్తు తరాలు భగీరథ చరిత్ర తెలుసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం బిసి సంఘం గౌరవ సలహాదారులు యార్లగడ్డ గోవర్ధనరావు, రావులకొలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యక్షులు నున్న గణేష్, మీడియా కన్వీనర్ జి. శ్రీనివాసరావు, నాగరాజు, ఓంకార్, బిసి సంఘం అధికార ప్రతినిధి ఎస్‌కె సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ నోట్లకు వస్తువులు అమ్మబడవు.. ఓ షాపులో వింత ప్రచారానికి తెర..




**గుడివాడ,మే 15 (వార్తాప్రభ) :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం అనేది రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన హక్కు. అయితే కొందరు ఈ ఓటును వేలంపాటలో వస్తువులను అమ్మినట్లు ప్రజా ప్రతినిధులకు అమ్ముకుంటున్నారు. సరైన రేటు ఇస్తేనే ఓటు వేస్తామని బల్లగుద్ది చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే తమకు ఓటు ఇవ్వలేదని ఓటు వేయమంటూ బహిష్కరించిన ఉదంతాలు చూశాము. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం అనేది రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన హక్కు. అయితే కొందరు ఈ ఓటును వేలంపాటలో వస్తువులను అమ్మినట్లు ప్రజా ప్రతినిధులకు అమ్ముకుంటున్నారు. సరైన రేటు ఇస్తేనే ఓటు వేస్తామని బల్లగుద్ది చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే తమకు ఓటు ఇవ్వలేదని ఓటు వేయమంటూ బహిష్కరించిన ఉదంతాలు చూశాము. ఇలాంటి ఓటరు కోసం ఓ వ్యాపారి వింత ప్రచారానికి తెరలేపారు. ఓటరు మహాశయులారా.. నోటుకు ఓటును అమ్ముకున్న డబ్బులతో తమ షాపుకు వస్తువులు కొనేందుకు రావొద్దంటూ బోర్డు పెట్టాడు. దీంతో అటుగా వెళ్లిన జనం షాక్ అవుతున్నారు. గుడివాడలో ఓ రేడియో షాపు యాజమాని ఈ రకమైన ప్రచారం చేస్తున్నారు. నగరంలో కొందరిని ఈ సందేశం అకర్షించింది. దీంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మరింది. దీనిపై నెటిజెన్లు కూడా తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ఇలాంటి వారు ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఆదర్శంగా నిలుస్తారని చెబుతుంటే.. మరి కొందరు మాత్రం ఏవి రాజకీయనాయకులు పంచిన నోట్లు, ఏవి నిజాయితీగా సంపాదించిన నోట్లు కనుక్కోవడం ఎలా అని ప్రశ్నిస్తున్నారు. దీంతో ఈ వార్త తెగ ప్రాధాన్యం సంతరించుకుంది.

# నేడు ఏ.పీ. ఎంసెట్ ఎంట్రన్స్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ముఖ్యమైన సూచనలు




**గుడివాడ,మే 15 (వార్తాప్రభ) :** ఏపీ ఎంసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ముఖ్యమైన సూచనలు.. నాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు పొందిన వికెఆర్, విఎన్‌బి & ఏజికె కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (వివిజివి) – గుడివాడ : పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు శుభాకాంక్షలు.. ది 16-5-24 నుండి 23-5-24 వరకు ఏపీ ఎంసెట్ పరీక్ష జరుగును. పై తేదీలలో మీ హాల్ టికెట్ లో ఉన్న తేదీని జాగ్రత్తగా సరి చూసుకోగలరు. మీకు ఇచ్చిన రోజున మాత్రమే మీకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష కేంద్రం చిరునామా జాగ్రత్తగా చూసుకోగలరు. ఏపీ ఎంసెట్ హాల్ టికెట్., గుర్తింపు కార్డు తీసుకొని వెళ్ళాలి. కుల ధృవీకరణ పత్రం (వర్తిస్తే) తప్పనిసరిగా తీసుకెళ్లాలి, విఫలమైతే వారు ఏపీ ఎంసెట్ పరీక్షకు హాజరు కావడానికి అనుమతించబడరు. నెగటివ్ మార్కింగ్ లేదు కనుక అన్నీ ప్రశ్నలకు సమాధానం వ్రాయడం మంచి నిర్ణయం. పరీక్ష కేంద్రానికి 1గంట ముందుగా చేరుకోవడం మంచిది. నిమిషం ఆలస్యం అయినా పరీక్షకు అనుమతించబడరు. ఇంటర్మీడియట్ మార్క్స్ 25%- ఏపీ ఎంసెట్ 75% వెయిటేజ్ రూల్ ఉన్నది. ఒత్తిడికి లోనవకుండా పరీక్ష వ్రాయగలరు. హ్యాపీ2హెల్ప్.. 7702727108, 99898 00781, 96522 16258, 89850 50786, 83320 41258, 90008 1413..

# నేనెప్పుడూ హిందూ, ముస్లిం అని చెప్పలేదు.. పేద కుటుంబాల గురించే మాట్లాడాను : మోడీ



**వారణాసి,మే 15 (వార్తాప్రభ) :** ప్రధాని మోడీ రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో ముస్లింలు చొరబాటుదారులు.. అధిక సంఖ్యలో పిల్లల్ని కంటారు అని అన్నారు. ప్రధాన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా దుమారం రేగింది. మోడీ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎఐఎంఐఎం చీఫ్ అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా ఖండించారు. తాజాగా ఈ వ్యాఖ్యలపై ప్రధాని మోడీ స్పందించారు. మంగళవారం మోడీ న్యూస్ ఛానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో.. ఈ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తాను కేవలం ముస్లింల గురించి మాత్రమే మాట్లాడలేదని, ప్రతి పేద కుటుంబం గురించి మాట్లాడానని స్పష్టం చేశారు. హిందూ- ముస్లిం అంటూ రోజును ప్రారంభించినరోజు.. ప్రజాజీవితానికి అనర్హుడవుతాడు అని ఆయన అన్నారు. ముస్లింల పట్ల ప్రేమను తాను మార్కెట్ చేసుకోనని మోడీ అన్నారు. తాను ఓటు బ్యాంక్ కోసం పనిచేయనని.. కేవలం సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్‌నే నమ్ముతానని మోడీ తెలిపారు. 'నేను ఆశ్చర్యపోయాను. ఎక్కువ మంది పిల్లలు ఉన్న వ్యక్తుల గురించి మాట్లాడినప్పుడల్లా వారు ముస్లింలు అని మీకు ఎవరు చెప్పారు? ముస్లింల పట్ల ఎందుకు ఇంత అన్యాయం చేస్తున్నారు? పేద కుటుంబాల్లోనూ ఇదే పరిస్థితి. పేదరికం ఉన్నచోట, వారి సామాజిక సర్కిల్‌తో సంబంధం లేకుండా ఎక్కువమంది పిల్లలు ఉన్నారు. నేను హిందువుగానీ, ముస్లిం గురించి గానీ ప్రస్తావించలేదు. నువ్వు చూసుకోగలిగినంత మంది పిల్లల్ని కనాలి అని చెప్పాను. మీ పిల్లలను ప్రభుత్వమే చూసుకోవాల్సిన పరిస్థితి రావద్దు.' అని అన్నాను అని మోడీ ఈ ఇంటర్వ్యూలో అన్నారు. 'ఈ సమస్య ముస్లింలకు సంబంధించింది కాదు. మోడీకి వ్యక్తిగతంగా ముస్లింలు ఎంత మద్దతు ఇస్తున్నారనే దానితో సంబంధం లేకుండా.. 'ఇది చేయండి,' అది చేయండి' అని వారిని నిర్దేశించే ఆలోచనా ధోరణిగలవారిది. నా ఇంట్లో, నా చుట్టూ ముస్లిం కుటుంబాలన్నీ ఉన్నాయి. ఈద్ రోజున మా ఇంట్లో భోజనం వండేవారు కాదు. ముస్లింలే మాకు ఆహారాన్ని తెచ్చిపెట్టేవారు. నేటికీ నా స్నేహితుల్లో ముస్లింలే చాలామంది ఉన్నారు. 2002 (గోధ్రా అల్లర్లు) తర్వాత నా ప్రతిష్ట దిగజారింది.' అని ఆయన అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింలు తనకు ఓటేస్తారా అని అడిగిన ప్రశ్నకు.. 'దేశ ప్రజలు నాకే ఓటేస్తారు' అని మోడీ సమాధానమిచ్చారు. తాను హిందూ- ముస్లిం అని వేరు చేసి చెప్పినరోజున ప్రజాజీవితానికి అర్హుడిని కాను. ఇది నా ప్రతిజ్ఞ.

# టీడీపీ అరాచకం.. డీజీపీకి వైఎస్సార్సీపీ ఫిర్యాదు




**గుంటూరు, మే 15 (వార్తాప్రభ) :** టీడీపీ దాడులు, హింసాత్మక చర్యలపై డీజీపీకి వైఎస్సార్సీపీ ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ నేతలు మేరుగు నాగార్జున, అంబటి రాంబాబు, పేర్ని నాని డీజీపీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబు మంగళగిరి డీజీపీ కార్యాలయం దగ్గర మీడియాతో మాట్లాడుతూ, పోలింగ్ బూత్లలో హింస జరుగుతుంటే పోలీసులు అడ్డుకోలేదన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. కొంతమంది పోలీసులు టీడీపీకి కొమ్ము కాశారని మండిపడ్డారు. "వైఎస్సార్సీపీ నేతలను ఎక్కడికక్కడ హౌస్ అరెస్టు చేశారు. టీడీపీ నేతలు మాత్రం విచ్చలవిడిగా తిరిగారు. కూటమి ఫిర్యాదుతో ఈసీ పోలీస్ అధికారులను మార్చింది. అధికారులను మార్చిన తర్వాత కూడా హింస ఎందుకు జరిగింది?" అంటూ అంబటి రాంబాబు ప్రశ్నించారు. "పోలీసు వ్యవస్థలో కొంతమంది టీడీపీ వారితో కలిసిపోయారు. మాకు బాగా ఓట్లు పడేచోట భారీగా పోలీసులను పెట్టారు. టీడీపీకి బలమైన గ్రామాలలో పోలీసులను పెట్టలేదు. దీంతో వారు పోలింగ్ బూత్లను క్యాప్చర్ చేశారు. నన్ను హౌస్ అరెస్టు చేసి, నా ప్రత్యర్థిని యథేచ్ఛగా తిరగనిచ్చారు. చాలా దుర్మార్గపు చర్యలకు దిగారు. పోలీసు అధికారులను ఉన్నట్టుండి మార్చారు. అలా మార్చితే మేలైన పరిస్థితులు ఉండాలి కదా? మరి ఎందుకు హింస జరిగింది?. అధికారులను మార్చిన తర్వాత ఎందుకు హింస జరిగింది.. అవగాహన లేని డీజీపి, ఎస్పీలను పెట్టడం వలన హింస జరిగింది" అని అంబటి రాంబాబు పేర్కొన్నారు. "ఎన్నికల కమిషన్ తీసుకున్న తప్పుడు నిర్ణయం వలనే ఈ పరిస్థితి ఏర్పడింది. పోలీసు పరిశీలకుడు ఢిల్లీ ఆదేశాలు, పురంధేశ్వరి ఆదేశాలతోనే చేశారు. సీఎస్, డీజీపీలను ఢిల్లీకి పిలిచారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తన నియోజకవర్గంలో రీపోలింగ్ అవసరం లేదని ఈసీ ఎలా చెబుతుంది?. వెబ్ కెమెరాలను విశ్లేషించకుండా ఇలాంటి నిర్ణయం ఎలా తీసుకుంటారు?" అంటూ అంబటి రాంబాబు ప్రశ్నించారు.

**పక్కా ప్లాన్ ప్రకారమే ఈ దారుణాలు: మాజీ మంత్రి పేర్ని**

టీడీపీ నేతలు, కార్యకర్తలు యథేచ్ఛగా కర్రలు, రాడ్లతో దాడులు చేశారు. మా వాళ్లు ఎదురు తిరిగితే మాపై కేసులు పెడుతున్నారు. పోలింగ్ తర్వాత జరుగుతున్న హింసలకు పోలీసుల వైఫల్యమే కారణం. పల్నాడు ఎస్పీకి ఫోన్లు చేసినా పట్టించుకోలేదు?. రిటైర్డ్ అధికారిని పోలీసు అబ్జర్వర్ని పెడితే ఏం జవాబుదారీతనం ఉంటుంది. బీజేపి, కూటమికి సహకరించమని పోలీసు అధికారులనే ఆయన బెదిరించారు. మా కార్యకర్తలపై హత్యానేరం కేసులు పెడుతున్నారు. పురంధేశ్వరి చెప్పినట్టు పోలీసు అధికారును మార్చినచోటే హింస జరిగింది. అంటే పక్కా ప్లాన్ ప్రకారమే ఈ దారుణాలకు పాల్పడ్డారు.

# తిరుమల ఘాట్ రోడ్డులో మరోసారి చిరుత కలకలం..



**తిరుమల,మే 15 (వార్తాప్రభ) :** తిరుమలలో మరోసారి చిరుత సంచారం కలకలంరేపింది. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే ఘాట్ రోడ్డులో చిరుత ప్రత్యక్షమైంది. తెల్లవారుజామున భక్తుల కారులో ఘాట్ రోడ్డులో వెళుతుండగా.. చిరుత అడ్డుగా వచ్చింది. చిరుత సంచారానికి సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. గతంలో అలిపిరి నడకమార్గం, శ్రీవారి మెట్టు మార్గంలో చిరుతలు కనిపించాయి.. ఈసారి ఘాట్ రోడ్డులో ప్రత్యక్షం కావడం కలకలంరేపింది. గతేడాది అలిపిరి నడకమార్గంలో చిరుతల సంచారం కలకలంరేపింది. ముందుగా ఓ బాలుడిపై దాడి చేయగా తీవ్ర గాయాలు అయ్యాయి.. ఆ తర్వాత కొంతకాలానికి మరో చిన్నారి లక్షితను చిరుత దాడి చేసి చంపేసింది. దీంతో టీటీడీ, అటవీశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు.. బోన్లు, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి చిరుతల్ని బంధించారు. ఏకంగా ఆరు చిరుతల్ని పట్టుకుని తిరుపతిలో జూకు తరలించారు.అంతేకాదు చిరుతల సంచారంతో టీటీడీ భక్తుల భద్రతకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంది. నడకమార్గంలో ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే చిన్నారులకు అనుమతి ఇచ్చారు. 15 ఏళ్లలోపు పిల్లలకు అనుమతి నిరాకరించింది టీటీడీ. అంతేకాదు ఘాట్ రోడ్డులో సాయంత్రం ఆరు గంటల తర్వాత బైక్‌లను అనుమతించలేదు.. అయితే ఈ నిబంధనను తర్వాత సడలించారు. అంతేకాదు భక్తులు గుంపులు, గుంపులుగా వెళ్లాలని టీటీడీ, అటవీశాఖ అధికారులు సూచించారు. అంతేకాదు నడకమార్గంలో వెళ్లే భక్తులకు టీటీడీ చేతి కర్రను కూడా అందించిన సంగతి తెలిసిందే. అయితే చాలా రోజుల తర్వాత మళ్లీ చిరుత తిరుమల ఘాట్ రోడ్డులో ప్రత్యక్షం కావడం కలకలంరేపింది.

# కడప లోక్ సభ సీటులో క్రాస్ ఓటింగ్ ? షర్మిలకే టీడీపీ ఓట్లు.. !



**కడప,మే 15 (వార్తాప్రభ) :** ఏపీలో ఈసారి ఎన్నికల్లో అత్యంత ఉత్కంఠ రేపిన నియోజకవర్గాల్లో కడప లోక్ సభ స్థానం కూడా ఒకటి. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య దర్యాప్తును అడ్డుకుంటున్నారన్న కారణంతో అన్న జగన్ పైనే వార్ ప్రకటించిన పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల.. తనకు పట్టున్న కడప లోక్ సభ సీటులో పోటీకి దిగారు. అక్కడ వరుసగా రెండుసార్లు గెలిచి హ్యాట్రిక్ కోసం చూస్తున్న వివేకా కేసు నిందితుడు, తన సోదరుడూ అయిన వైఎస్ అవినాష్ రెడ్డిని ఎలాగైనా ఓడించాలనే కోరికతో షర్మిల పోటీ చేశారు. కడప లోక్ సభ సీటుకు ఈసారి జరిగిన ఎన్నికల్లో అన్ని అజెండాలూ పక్కకుపోయి వివేకా హత్య ప్రధాన అజెండాగా మారిపోయింది. న్యాయం కోసం వివేకా కుమార్తె చేస్తున్న పోరాటానికి తోడైన వైఎస్ షర్మిల.. వ్యూహాత్మకంగా ఈ సీటులో పోటీకి దిగడంతో ఉత్కంఠ మరింత పెరిగింది. ఈ క్రమంలో వివేకా హత్య కేంద్రంగా షర్మిల, సునీత గుప్పించిన విమర్శలు ఓ దశలో పతాకస్థాయికి చేరుకున్నాయి. వీటిని అడ్డుకునేందుకు వైసీపీ నేతలు కడప కోర్టును ఆశ్రయించి గ్యాగ్ ఆర్డర్ తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో కొంగుచాచి ఓటు అడుగుతున్నా, న్యాయం చేయాలంటూ వివేకా కుమార్తెతో పాటు షర్మిల చేసిన వ్యాఖ్యలు అసలే సెంటిమెంట్ ఎక్కువగా ఉండే సీమ ఓటర్లను ఎక్కడో తాకినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీలకు అతీతంగా రష్మిలకు ఈసారి ఓటు వేసి గెలిపించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా జరిగిన పోలింగ్ సరళిని దగ్గరిగా గమనించిన వారు, ఇంకా చెప్పాలంటే ఓటేసిన వారు సైతం ఈ విషయాన్ని అంగీకరిస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా జగన్ కు ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న టీడీపీ సైతం తమ అభ్యర్థి భూపేష్ రెడ్డిని కాదని ఈసారికి షర్మిలకే ఓటేయాలని క్యాడర్ కు సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది. దీంతో ఆ పార్టీ క్యాడర్ అంతా ఎమ్మెల్యే ఓటును తమ అభ్యర్థులకు వేసి ఎంపీ ఓటు మాత్రం షర్మిలకే వేసినట్లు సమాచారం. అయితే ఇంత చేసినా రేపు షర్మిల కచ్చితంగా గెలుస్తుందని చెప్పలేని పరిస్థితి. ఎందుకంటే కడప జిల్లాలో సంప్రదాయంగా వైసీపీకి ఉన్న ఓటు బ్యాంకే కారణం.

# అపర భగీరదుడు సర్ ఆర్థర్ కాటన్



**గుడివాడ,మే 15 (వార్తాప్రభ) :** డెల్టా ప్రజలకు సాగునీటిని అందించి ఈ ప్రాంతాన్ని సస్య శ్యామలం చేసిన మహనీయుడు సర్ ఆర్ధర్ కాటన్ అని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీ కాట్రగడ్డ సింహాద్రి అప్పరావు అన్నారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలోని కాటన్ విగ్రహానికి పూలమాలవేసి ఆయన నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి జె ఎస్ కుమార్ గారు మాట్లా డుతూ దవళ్వేరంలో ఆనకట్ట నిర్మించి ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు సాగు, తాగునీరు అందించిన మహనీయుడు సర్ ఆర్ధర్ కాటన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శివనాథ్, అధ్యాపకులు మరియు విధ్యార్థులు పాల్గొన్నారు.

# ఓటమి కి భయపడే వైకాపా గుండాల దాడులు

**● గన్నవరం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త చలమల శెట్టి రమేష్ బాబు ● రంగన్నగూడెంలో రాష్ట్ర టిడిపి నేత "ఆళ్ళ" ను పరామర్శించిన "చలమల శెట్టి"**



**హనుమాన్ జంక్షన్,మే 15 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గంలో ఓటమికి భయపడే వైకాపా శ్రేణులు దాడులు దిగుతున్నారని గన్నవరం నియోజకవర్గం జనసేన సమన్వయకర్త చలమల శెట్టి రమేష్ బాబు అన్నారు. పోలింగ్ సందర్భంగా కొత్త మల్లవల్లి లో జరిగిన దాడికి గురైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నేత ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావును పలువురు నాయకులు పరామర్శించారు. ఈరోజు ఉదయం చలమలశెట్టి రమేష్ బాబు,కృష్ణాజిల్లా తెలుగు రైతు మాజీ అధ్యక్షులు చిట్నేని వెంకట శివరామకృష్ణారావు,కోడూరుపాడు మాజీ సర్పంచ్ అర్నేపల్లి సూరిబాబు,పలువురు టిడిపి,జనసేన నాయకులు రంగన్న గూడెం లోని "ఆళ్ళ" నివాసంలో గోపాల కృష్ణ ని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా చలమల శెట్టి రమేష్ బాబు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గం నుంచి జనసేన, బిజెపి మద్దతుతో పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు ప్రజల నుంచి మంచి స్పందన ఉందని, దీనిని ఓర్వలైతే పోలింగ్ సందర్భంగా గ్రామాలలో వైసిపి గూండాలు దాడులకు పాల్పడ్డారని, కొత్త మల్ల వల్లి గ్రామంలో ఎన్నికల ఏజెంట్ గా ఓటింగ్ సరళిని పరిశీలించటానికి వెళ్లిన రాష్ట్ర టీడీపీ నేత ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు పై భౌతిక దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు సముద్రాల రామయ్య షేక్ అహ్మద్,వడ్డీ శేఖర్,తూము రాధాకృష్ణ మూర్తి,వడ్డీ భార్గవ్ టిడిపి నాయకులు గండేపూడి నితీశ్ కుమార్,గండి అచ్చయ్య,రెడ్డి అప్పలనాయుడు,గండి శ్రీనివాసరావు, ఆర్నెపల్లి వెంకటేశ్వరరావు,రంగనగూడెం ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ,ఎంపీసీఎస్ అధ్యక్షులు మొవ్వ శ్రీనివాసరావు,కసుకుర్తి అర్జునరావు ,ఆలపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లా వేదికగా గోల్డ్ మైన్స్ తవ్వకానికి రెడీ




**కర్నూలు జిల్లా,మే 15 (వార్తాప్రభ) :** చాలా ఏళ్ల తర్వాత మన దేశంలో బంగారం ఉత్పత్తి మొదలుకానుంది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ వేదిక కానుంది. దేశంలో ప్రైవేటు రంగంలో ఫస్ట్ గోల్డ్ మైన్ ఇదే. ఏపీలోని కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు గనిలో కొద్దిరోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించి ప్రాసెసింగ్ ప్లాంట్ పనులు 80శాతం పూర్తి అయ్యాయి. నాలుగైదు నెలల్లో ఉత్పత్తి మొదలు కానున్నట్లు దక్కన్ గోల్డ్ మైన్స్ వెల్లడించింది.

**స్థల సేకరణ, ప్లాంట్ పనులు రెడీ..**

దీనికోసం ఇప్పటికే 250 ఎకరాలకు పైగా భూమిని సేకరించడం, ప్లాంట్ పనులు చేపట్టింది. ఏటా 750 కిలోల బంగారు ఉత్పత్తి చేయాలన్నది ఆ కంపెనీ అంచనా. ఇప్పటివరకు ఈ బంగారు గనిపై దాదాపు కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టింది. ఏపీలోని చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కొన్ని పసిడి గనులను గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. వీటిని తవ్వేందుకు ప్రభుత్వ రంగం సంస్థ ఎన్‌ఎండీసీ ముందుకొచ్చింది. వీటిని తమకు అప్పగించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరింది.

**బ్రిటిష్ కాలానికి ముందు నుంచే..**

రాయలసీమలో బంగారం కోసం అన్వేషణ ఈనాటిది కాదు. బ్రిటిష్ పాలనకు ముందు మహమ్మదీయులు, శ్రీకృష్ణదేవరాయుల కాలంలో కూడా మైనింగ్ జరిగినట్టు ఆధారాలున్నాయని చెబుతున్నాయి. అపారమైన ఖనిజ నిక్షేపాలు బంగారం, వజ్ర సంపద ఉన్న ప్రాంతంలో అశోకుడు ఆయన అధికారులు విడిది చేశారని అంటున్నారు. ఇందుకు సాక్ష్యం జొన్నగిరి సమీపంలో అశోకుని శిలాశాసనాలే ఉదాహరణగా చెబుతున్నారు. మొత్తానికి రాయలసీమ పసిడికి ఉత్పత్తికి వేదిక కావడం మరో ప్రాధాన్యంగా మారింది.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188